నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | శనివారం 3-4-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 202 | పేజీలు: 4 | వెల: రూ.1/-

తెలంగాణలో గణనీయమైన ప్రగతిని సాధించాం

ఏడేళ్ల క్రితం నాటి పరిస్థితులకు నేటికి ఎంతో తేడా
చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిందే
మిషన్ భగీరథతో మంచినీటి సమస్యను అధిగమించాం
ఖమ్మంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కెటిఆర్ శ్రీకారం
డబుల్, ఇళ్లు, కొత్త బస్టాండ్‌లకు ప్రారంభోత్సవాలు
ఆర్టీసిని లాభాల బాట పట్టిస్తున్నామని వెల్లడి
ఖమ్మం నగరంలో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని కితాబు

ఖమ్మం,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో గత ఏడేళ్లలో గణనీయమైన ప్రగతిని సాధించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇందుకు ఖమ్మం నగరంలో జరిగిన అభివృద్ధి చూస్తే చాలన్నారు. గతానికి నేటికి బేరీజు వేసుకుంటే ఎంత అభివృద్ధి సాధించామో చూడవచ్చన్నారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పాల్సిందేనని, ఎన్నికల సమయంలో తప్పకుండా ప్రజలకు వివరించాల్సిందేనని అన్నారు. ఖమ్మంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి కెటిఆర్ శ్రీకారం చుట్టారు. మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, పువ్వాడ అజయ్, ఎంపి నామానాగేశ్వర రావుతో పాటు, స్థానికి ఎమ్మెల్యేలు పలువురు పాల్గొన్నారు. ఖమ్మంలో ఐటీ హబ్‌-2 నిర్మాణానికి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... తెలంగాణలో ఐటి రంగం మంచి పురోగతిలో వుందని.. రాష్ట్రం ఏర్పాటైన కొత్తలో ఉద్యోగాలు వస్తాయా ? అన్న అనుమానాలు పటాపంచలు చేశామని పేర్కొన్నారు. దీనికి కారణం... స్థిరమైన ప్రభుత్వం, కేసీఆర్ నాయకత్వమేనని కొనియాడారు. దేశ వృద్ధి రేటు కంటే తెలంగాణ వృద్ధి రేటు ఎక్కువగా వుందని స్పష్టం చేశారు. 2014లో 56,000 కోట్ల ఐటి ఎగుమతి ఉంటే... నేడు లక్ష 40 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. గూగుల్, ఫేస్‌బుక్ వంటి సంస్థలు పెద్ద నగరాలను వదిలి పెట్టి... హైదరాబాద్ వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. మన తెలంగాణ రాష్ట్రంలో చురుకైన యువత ఉందని తెలిపారు. ఐటీ రంగం... హైదరాబాద్ కే పరిమితము కాకుండా మారుమూల పట్టణాలకు విస్తరిస్తోం దన్నారు. ఇకపోతే వినూత్నమైన ఆలోచనలతో నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో రూ. 25 కోట్లతో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, పువ్వాడ అజయ్ కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. ఆర్టీసీని కూడా బలోపేతం చేస్తూ లాభాల బాటలో పయనింపజేసేందుకు కార్గో లాంటి సర్వీసులను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. ఆర్టీసీని మరింత లాభాల్లోకి తీసుకొస్తే.. మిగతా నగరాల్లోనూ ఆధునికమైన బస్టాండ్లను ఏర్పాటు చేసేందుకు వీలుంటుందన్నారు.

ఖమ్మం పట్టణాన్ని పువ్వాడ అజయ్ అద్భుతంగా తీర్చిదిద్దారు. గాంధీ కూడలిని అద్భుతంగా సుందరీకరించారు. గత ఏడేళ్లుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఖమ్మం పట్టణాన్ని చూసి ఇతర పట్టణాల ప్రజాప్రతినిధులు నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. టేకులపల్లిలో 1004 ఇండ్లు ప్రారంభించుకున్నాం. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు ఇచ్చాం. మనం చేసిన పనిని ప్రజలకు గుర్తు చేయాలి. తెలంగాణ రాకముందు ఉన్న పరిస్థితులను, ఇప్పుడున్న పరిస్థితులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సామాన్యుడికి సేవలందించడమే కాదు.. వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ముందుచూపుతో పని చేయాలని సీఎం సూచిస్తుంటారు. ఖమ్మంలో ఇప్పటికే ఒక సమీకృత మార్కెట్ ఉంది.. మరో మూడు కావాలన్నారు. తప్పకుండా మంజూరు చేస్తామన్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో ప్రజల ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. పని చేసే ప్రభుత్వాన్ని, నాయకులను ప్రజలు ఎప్పుడూ ఆశీర్వదిస్తారు.. ఆదరిస్తారు అనే నమ్మకం ఉందన్నారు. కేంద్రం ఎన్నో మాటలు చెప్పింది.. కానీ నిలబెట్టుకోవడం లేదు. జీఎస్టీ బకాయిలు మన దగ్గర తీసుకోవడమే తప్ప తిరిగి ఇచ్చింది ఏం లేదు అని కేటీఆర్ అన్నారు. అంతకుముందు ఖమ్మం జిల్లాలో డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అందరి దృష్టిని ఆకర్షించారు. డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న క్రమంలో.. ఓ ఇంటిలోని నల్లాను తానే స్వయంగా ఆన్ చేసి నీళ్లను తాగారు. రాష్ట్రంలోని ప్రతి నివాస సముదాయానికి మిషన్ భగీరథ నీళ్లు అందుతున్న విషయం తెలిసిందే. ఖమ్మం

అర్బన్ మండలం టేకులపల్లిలో రూ. 60.20 కోట్లతో నిర్మించిన 1,004 డబుల్ బెడ్రూం ఇండ్లను మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, పువ్వాడ అజయ్ కలిసి ప్రారంభించారు. టేకులపల్లిలో డబుల్‌బెడ్‌రూం గృహ లబ్దిదారులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ సెంటర్లను, ప్రాథమిక ఉప కూరగాయల మార్కెట్‌ను మంత్రులు సందర్శించి వాటిని ప్రారంభించారు.

డీఎంకె, కాంగ్రెస్‌లకు మహిళలపై చిన్నచూపు

-మరోమారు ఎన్నికల ప్రచారసభలో ప్రధాని విమర్శలు

మదురై,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): తమిళనాడులో ప్రతిపక్ష డీఎంకే, కాంగ్రెస్ పార్టీలకు మహిళలపట్ల గౌరవభావం లేదని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించారు. శుక్రవారం మదురైలో ఎన్నికల ప్రచారసభలో మాట్లాడిన ప్రధాని.. నారీశక్తి ప్రాధాన్యం గురించి మదురై ఎన్నో పాటలు చెప్పిందని పేర్కొన్నారు. మహిళలను ఏవిధంగా గౌరవించాలో, ఏవిధంగా ఆరాధించాలో ఇక్కడ చూడవచ్చన్నారు. డీఎంకే, కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మహిళలను గౌరవించడంగానీ, భద్రత కల్పించడంగానీ చేయలేవని ఆయన విమర్శించారు. డీఎంకే నేతలు పదేపదే మహిళలను కించపరుస్తుంటారని ఆరోపించారు. మదురై ప్రజలు తెలివైనవారని, ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారని, రాజకీయ పార్టీల గుణగణాలను గుర్తించి అభివృద్ధికి భరోసా ఇస్తున్న ఎన్డీయే కూటమికే ఓటు వేస్తారని ప్రధాని వ్యాఖ్యానించారు. టెక్స్‌టైల్ రంగంలో మరింత యాంత్రీకరణ, రుణ సౌలభ్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఏడాది బ్జడెట్‌లో మెగా-ఇన్వెస్ట్‌మెంట్ టెక్స్‌టైల్ పార్క్ పథకం 'ఓఎ÷ుఖీం'ను ప్రకటించామని చెప్పారు. రాబోయే మూడేళ్లలో ఏడు టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నిజామాబాద్‌లో ఘోర దుర్ఘటన

గోదావరిలో స్నానానికి దిగి ఆరుగురు గల్లంతు
ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): నిజామబాద్ జిల్లాలో విషాదం నెలకొంది. గోదావరిలో ఆరుగురు గల్లంతయ్యారు. మెండోరా మండలం పోచంపాడు వద్ద ఈ విషాదం నెలకొంది. పోచంపాడు ప్రాజెక్టు దిగువన.. గోదావరిలో పుణ్యస్నానాల కోసం వచ్చిన ఏడుగురు వ్యక్తులు నదిలో ఇక్కడికి వస్తుంటారు. ఈ క్రమంలో ఉదయం స్నానాలు చేసేందుకు నదిలో దిగిన సమయంలో ప్రమాదవశాత్తూ ఇద్దరు చిన్నారులు నదిలోకి జారిపోయారు. వారిని కాపాడేందుకు మరో అయిదుగురు నదిలోకి దిగారు. వారిలో ముగ్గురు పెద్దలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. ఈఘటనపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పోచంపాడు పుష్కర ఘాట్ దగ్గర గోదావరి నదిలో ఆరుగురు మృతి చెందడంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్నానానికి గాను నదిలో దిగి దురదృష్టవశాత్తు ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

రాజు(24)గా గుర్తించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గోదావరిలో స్నానం చేస్తుండగా ఏడుగురు నీట మునిగారు. వీరిని గమనించిన స్థానికులు గోదావరిలోకి దూకి గాలింపు చేపట్టారు. ఏడుగురి ఒక వ్యక్తి ప్రాణాలతో సురక్షితంగా బయటపడగా.. మరో ఆరుగురు గల్లంతయ్యారు. ముమ్మర గాలింపు అనంతరం ఆరు మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతులంతా మాక్లూర్, డీకంపల్లి, గుత్ప, నిజామాబాద్, ఎల్లమ్మ గుట్టకు చెందిన జీలకర్ర సురేష్, యోగేష్, బొబ్బిలి శ్రీనివాస్, సిద్దార్థ్, శ్రీకర్, దొడ్డె గల్లంతు అయ్యారు. వీరిలో ఒకరు సురక్షితంగా బయటపడగా, మిగతా వారు గల్లంతు అయినట్లు పోలీసులు తెలిపారు. గల్లంతు అయిన వారిలో ఇద్దరి మృతదేహాలను జాలర్ల సహాయంతో పోలీసులు బయటకు తీశారు. మిగతా వారి కోసం నదిలో గాలిస్తున్నారు. బాధితులంతా ఒకే కుటుంబానికి చెందినవారు. బాధితుల స్వస్థలం ఎల్లమ్మగుట్ట, డీకంపల్లి, గుత్పా. సురక్షితంగా బయటపడిన వ్యక్తిని దర్పల్లి రవికాంత్(15)గా గుర్తించారు. గల్లంతైన వారిని జీలకర్ర సురేశ్(40), జీలకర్ర యోగేష్(16), బొబ్బిలి శ్రీనివాస్ (40), బొబ్బిలి సిద్దార్థ్(16), బొబ్బిలి శ్రీకర్(14), దొ÷-లడె రాజుగా గుర్తించారు. కాగా ఘటన స్థలానికి చేరుకున్న మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రతి శుక్రవారం గోదావరిలో తెప్ప దీపం సమర్పించేందుకు భక్తులు పెద్ద ఎత్తున

మరో నిరుద్యోగి జీవితం విషాదాంతం

ఉద్యోగాల కోసం విసిగివేసారి ఆత్మహత్య
చికిత్స పొందుతూ నిమ్స్‌లో మృతి
గాంధీకి మృతదేహం తరలింపు..
మార్చురీ వద్ద నిరుద్యోగుల ఆందోళన
కుటుంబ సభ్యులకు బండి సంజయ్ పరామర్శ
ఇది ముమ్మాటికీ కెసిఆర్ హత్యే అని విమర్శ
ఆందోళన చేస్తున్న పలువురు నిరుద్యోగుల అరెస్ట్

హైదరాబాద్,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): ఉద్యోగావకాశాలు రాక..నోటిఫికేషన్లు ఇవ్వడం లేదన్న ఆందోళనలో కాకతీయ యూనివర్సిటీలో ఆత్మహత్యాయత్నం చేసిన నిరుద్యోగి బోడ సునీల్ నాయక్.. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఏడేళ్లు అవుతున్నా ప్రభుత్వం జాబ్ నోటిఫికేషన్ ప్రకటించడం లేదని ఆవేదన చెంది మార్చి 27న సునీల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి విదితమే. పురుగుల మందు తాగిన సునీల్‌ను విద్యార్థులు.. ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సునీల్ మరణించాడు. సునీల్ స్వస్థలం వరంగల్ జిల్లా గూడూరు మండలం గుండెంగ సోమ్లా తండా. సునీల్ మృతదేహాన్ని నిమ్స్ నుండి గాంధీ ఆస్పత్రికి తరలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేయడం లేదని మనస్తాపం చెందిన కేయూ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. 10 రోజుల క్రితం బొడ్డ సునీల్ అనే విద్యార్థి పురుగుల మందు తాగగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమించడంతో హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. ఈ నేపథ్యంలో గాంధీ ఆసుపత్రిలో ఉద్రిక్తత నెలకొంది. గాంధీ ఆసుపత్రికి పెద్ద ఎత్తున చేరుకున్న బీజేపీ నేతలు, విద్యార్థులు, సునీల్ బంధువులు మార్చురి ముందు ఆందోళన చేశారు. సీఎం కేసీఆర్ తక్షణమే స్పందించి.. సునీల్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భారీగా మోహరించిన పోలీసులు.. ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేశారు. సునీల్ నాయక్ కుటుంబాన్ని గాంధీ ఆసుపత్రి వద్ద రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ, సునీల్ నాయక్‌ది ఆత్మహత్య కాదని.. ఇది కేసీఆర్ సర్కార్ హత్య అంటూ ధ్వజమెత్తారు. ఆత్మహత్య చేసుకునే ముందు సునీల్.. కేసీఆర్ పేరు ప్రస్తావించాడన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు రావడం లేదు కాబట్టే ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. కేసీఆర్‌పై కేసు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు తొందరపడి ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని.. కేసీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టి ఉద్యోగాలు కల్పిస్తామని బండి సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ గాంధీ ఆస్పత్రికి వెళ్లి సునీల్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇది సీఎం కేసీఆర్ చేసిన హత్యని అన్నారు. అసలు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే సీఎం గానీ, మంత్రులు గానీ ఎవరూ ఆ పేద కుటుంబానికి భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు.

సీఎం కేసీఆర్ కుటుంబం మాత్రం ఉద్యోగం లేకుండా బతకలేరని, రాష్ట్రంలో చదువుకున్న యువతకు మాత్రం ఉద్యోగాలు లేవని బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్ అంటూ మాయమాటలు చెబుతారని, ఎన్నికలు అయిన తర్వాత మరిచిపోతారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిపై కేసు పెట్టాలని సంజయ్ అన్నారు. ఆనాడు అనేకమంది బలిదానాలతో ప్రత్యేక తెలంగాణ వచ్చిందని, ఈనాడు సీఎం తన పదవిని కాపాడుకోవడం కోసం అనేకమందిని బలితీసుకుంటు న్నారని విమర్శించారు. దయ చేసి విద్యార్థులు ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని బండి సంజయ్ సూచించారు. సర్కార్ చేతగాని తనం వల్లే కేయూ విద్యార్థి సునీల్ ఆత్మహత్య చేసుకున్నాడని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగులను పట్టించుకోవట్లేదన్నారు. సునీల్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువత ఎవ్వరు ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ భర్తీ చేయకుండా నిరుద్యోగులతో జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు. నోటిఫికేషన్లు రావడంలేదని మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్న సునీల్ నాయక్ మృతి పట్ల తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. దీంతో వెంటనే వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. సునీల్ నాయక్ అంతిమయాత్రలో నిరుద్యోగులంతా పాల్గొనాలని యూత్ కాంగ్రెస్ పిలుపునిచ్చింది. కల్వకుంట్ల కుటుంబం కళ్ళుతెరిచే వరకు నిరుద్యోగులతో కలసి యూత్ కాంగ్రెస్ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. గాంధీ ఆసుపత్రి నుండి సునీల్ నాయక్ భౌతికకాయాన్ని స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా గూడూరుకు తరలించనున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో బాలుడితో సహా నలుగురు మృతి

కంటెయినర్ దూసుకెళ్లి బాలుడు మృత్యువాత
టిప్పర్ ఢీకొని ముగ్గురు యువకులు దుర్మరణం

హైదరాబాద్,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు, ఓ బాలుడు దుర్మరణం చెందారు. వాహనాలు సృష్టించిన బీభత్సంలో వీరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. సంగారెడ్డి పటాన్‌చెర్వు మండలం ఇస్నాపూర్ చౌరస్తా వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. ఓ కంటైనర్ ట్యాంకర్‌ను తప్పించబోయి అదుపు తప్పి గుడిసెలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో కంటైనర్ ఓ నాలుగేళ్ల బాలుడిని ఢీకొట్టింది. దీంతో బాలుడు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. మృతుడిని కంగ్టి మండలం తడ్కల్‌కు చెందిన శాంతికుమార్‌గా గుర్తించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా తల్లితో కలిసి చర్చికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పండుగ రోజే తల్లి కండ్ల ఎదుటే కొడుకు మృత్యువాత పడడంతో విషాదం నెలకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.ఇక నల్లగొండ జిల్లాలోని అనుముల మండలంలో ఘోర ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. మండలంలోని చింతగూడెం వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు.

తొలి డోస్ వ్యాక్సిన్ వేయించుకున్న గవర్నర్ తమిళసై

పుదుచ్చేరి,ఏప్రిల్2 (ఆంఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కొవిడ్ టీకా తొలి డోసు తీసుకున్నారు. పుదుచ్చేరికి చెందిన వైద్య సిబ్బంది ఆమెకు టీకా ఇచ్చారు. పుదుచ్చేరిలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ మహిళా, శిశువుల ఆస్పత్రిలో తమిళిసై టీకా తీసుకున్నారు. అనంతరం మాట్లాడిన ఆమె.. కరోనా కట్టడి కోసం ప్రతి ఒక్కరూ టీకా తీసుకోవాలని కోరారు. టీకాపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు.

ఏప్రిల్,మేలో కరోనా ఉధృతి ఉంటుంది

-అంచనావేసిన సూత్ర అనే గణిత విశ్లేషణ సంస్థ

న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ సెకండ్ వేవ్ ఉధృతంగా ఉన్న వేళ ఏప్రిల్ నెల మధ్య వరకు కరోనా పాజిటివ్ కేసులు తారా స్థాయికి చేరుకుంటాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. అయితే మే నెల చివర వరకు సంక్రమణ కేసులు తగ్గే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సూత్ర అనే గణిత విశ్లేషణ సంస్థ ఈ అంచనా వేసింది. భారత్‌లో వచ్చిన తొలి వేవ్‌పై కూడా సూత్ర గతంలో ఓ రిపోర్ట్ ఇచ్చింది. ఆగస్టులో కేసులు పెరిగి సెప్టెంబర్ వరకు హెచ్చు స్థాయికి చేరుకుంటుందని, ఆ తర్వాత 2021 ఫిబ్రవరిలో మళ్లీ కేసులు తగ్గుతాయని సూత్ర అంచనా వేసింది. ఐఐటీ ఖరగ్‌పూర్‌కు చెందిన మహీంద్ర అగర్వాల్ కేసుల పెరుగుదలపై అంచనాలు చేశారు. ప్రస్తుతం ఉన్న కేసుల సంఖ్యను పరిశీలిస్తే.. మిడ్ ఏప్రిల్ వరకు ఆ సంఖ్య భారీగా పెరుగుతుందన్నారు. ఏప్రిల్ 15 నుంచి 20 నాటికి కేసులు సంఖ్య గరిష్ట స్థాయికి చేరే అవకాశం ఉందన్నారు. అంతే వేగంగా కూడా మే చివరి నాటికి కేసులు తగ్గుతాయని అగర్వాల్ తెలిపారు. కొత్త ఇన్‌ఫెక్షన్ల డేటా ఆధారంగా కేసుల సంఖ్యను అంచనా వేస్తున్నామని, తొలుత పంజాబ్, ఆ తర్వాత మహారాష్ట్రలో కరోనా కేసులు తారా స్థాయికి చేరుకుంటాయని ఆయన అన్నారు. ఏప్రిల్-మే నెల మధ్య కాలంలో కేసులు గరిష్ట స్థాయిలో ఉంటాయని అశోకా వర్సిటీ శాస్త్రవేత్త గౌతమ్ మీనన్ తెలిపారు.

తెలంగాణకు వడగాడ్పుల ప్రమాదం

అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): తెలంగాణకు వడగాలుల ముప్పు పొంచి ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరిం చింది. శుక్ర, శనివారాల్లో గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భానుడి ప్రతాపంతో పాటు వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యంతో వేడి తీవ్రత మరింత పెరుగుతోంది. ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్ నగరం కూడా వేడెక్కుతోంది. 18 జిల్లాలను వడగాలుల తీవ్రత జాబితాలో విపత్తుల శాఖ చేర్చింది. కుమురంభీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాలకు మరింత ముప్పు ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

పిల్లల గొంతునులిమి తల్లి ఆత్మహత్య

తల్లి మృతి...పిల్లలకు తప్పిన ప్రమాదం

న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): పిల్లల గొంతునులిమి ఓ కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య చేసుకున్నది. ఆమె మరణించగా, పిల్లలు మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఘటన జరిగింది. సుశీల్ అనే వ్యక్తి పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతడు తన గ్రామం నుంచి గురువారం సాయంత్రం తిరిగి వచ్చాడు. ఇంటికి వెళ్లగా డోర్ లాక్ చేసి ఉన్నది. తలుపును ఎంత కొట్టినా భార్య తలుపు తీయలేదు. దీంతో బయటకు వెళ్లి మద్యం సేవించాడు. మరోవైపు స్థానికుల ఫిర్యాదుతో రాత్రి 8 గంటలకు పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. సుశీల్ అనుమతితో తలుపులు బద్ధలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా అతడి భార్య సీలింగ్‌కు వేలాడుతూ చనిపోయి కనిపించింది. కాగా బాత్‌రూమ్‌లో ఇద్దరు మగ పిల్లలు పడి ఉన్నారు. మెడ చుట్టూ గుడ్డతో నులిమినట్లు ఉన్నది. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. పిల్లలకు ప్రమాదం ఏమీ లేదని, వారు కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తేనే వేగంగా అభివృద్ధి

సాగర్ ఉప ఎన్నికల ప్రచారంలో మంత్రి తలసాని

నల్గొండ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): నాగార్జున నియోజక వర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్‌పార్టీని గెలిపిస్తే నియోజక వర్గం ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండదనీ, అధికార పార్టీ అభ్యర్ధిని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నోముల నర్సింహ్మయ్య మరణంతో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. కాబట్టి తిరిగి నోముల నర్సింహ్మయ్య కుమారుడు, టీఆర్ఎస్ అభ్యర్థి భగత్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. అదే నోములకు నిజమైన నివాళి అన్నారు. అధికార పార్టీ అభ్యర్థి ఉంటేనే అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకుని వెళ్లగలుగుతారని అన్నారు. త్రిపురారం మండలం పెద్ద దేవులపల్లిలో యాదవ సంఘం ఉద్యోగుల సమావేశంలో మంత్రి తలసాని పాల్గొని మాట్లాడారు. నాగార్జున సాగర్ నియోజక వర్గం అభివృద్ధికి గుండెబోయిన రామ్మూర్తి యాదవ్ ఎంతో కృషి చేశారని అన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారని అన్నారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహ్మయదని పేర్కొన్నారు. విద్యావంతుడు, యువకుడు నోముల భగత్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్‌పార్టీకి ఓటేసి గెలిపిస్తే ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. సుదీర్ఘకాలం మంత్రిగా ఉన్నా...అని గొప్పలు చెప్పుకునే జానారెడ్డి సాగర్ నియోజక వర్గం ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

గడిచిన 24 గంటల్లో 81,466 కొవిడ్ పాజిటివ్ కేసులు

కరోనా నివారణకు పటిష్ట చర్యలు
అప్రమత్తం అయిన కేంద్ర ప్రభుత్వం
రాష్ట్రాల సిఎస్‌లతో కేంద్ర కార్యదర్శి రాజీవ్ గౌబ వీడియో కాన్ఫరెన్స్
అధిక సంఖ్యలో టెస్టులు నిర్వహించాలని సూచన
45ఏళ్లు నిండిన వారికి వ్యాక్సినేషన్ చేయించాలి

న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు. దేశంలో కరోనా కేసులు రోజురోజుకూ అధికం అవుతున్న నేపథ్యంలో వివిధ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో శుక్రవారం ఆయన ఢిల్లీ నుండి వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గౌబ మాట్లాడుతూ ముఖ్యంగా 8 రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు ఆందోళన కలిగించే రీతిలో ఉన్నాయని ఈపరిస్థితుల్లో ఆయా రాష్ట్రాలు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సిఎస్‌లకు స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించుని అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా అధిక సంఖ్యలో కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ సిఎస్ లను ఆదేశించారు.అదే విధంగా పటిష్టమైన కంటైన్మెంట్ చర్యలు చేపట్టడంతో పాటు వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. గురువారం ఒక్కరోజే దేశంలో 81 వేల కరోనా కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంతటి తీవ్ర స్థాయికి చేరిందో అర్థం అవుతుందని అన్నారు. 45యేళ్ళు నిండిన వారందరికీ వ్యాక్సినేషన్ కు అనుమతి ఇచ్చినందున వారికందరికీ పెద్ద ఎత్తున వ్యాక్సిన్ అందించాలని చెప్పారు. కరోనా నిర్ధారణ అయినవారికి తగిన వైద్య సేవలు అందించడమే గాక వారితో సన్నిహితంగా మెలిగిన వారిని కూడా మూడు రోజుల్లోగా గుర్తించి వారిని హోం ఐసోలేషన్లో ఉంచాలని రాజీవ్ గౌబ స్పష్టం చేశారు. అంతేగాక గ్రామ స్థాయి నుండి ప్రభుత్వ,ప్రైవేట్ ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేయాలని చెప్పారు. ఆయా వైద్యశాలల్లో మరిన్ని ఐసోలేషన్, ఆక్సిజన్ పాడకులను అందుబాటులో ఉంచాలని సూచించారు. మార్కెట్లు,మాల్స్,రాజకీయ, సాంస్కృతిక,ప్రార్థనాపరమైన కార్యక్రమాలు జరిగేచోట్ల ప్రతి ఒక్కరూ తప్పని సరిగా మాస్కు నిర్మించడంతో పాటు భౌతిక దూరాన్ని పాటించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ సిఎస్ లకు స్పష్టం చేశారు. విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యా నాథ్ దాస్,వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కె.భాస్కర్ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఇదిలావుంటే దేశంలో కరోనా మళ్లీ ఉగ్రరూపం దాల్చుతోంది. పాజిటివ్ కేసులతో పాటు మరణాలు పెరుగుతున్నాయి. నిన్న రికార్డు స్థాయిలో మరణాలు నమోదవగా.. తాజాగా మరోసారి పెద్ద ఎత్తున జనం మహమ్మారికి బలయ్యారు. గడచిన 24 గంటల్లో 81,466 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర కుటుంబ, ఆరోగ్యమంత్రిత్వశాఖ శుక్రవారం తెలిపింది. గతేడాది అక్టోబర్ మొదటి వారం తర్వాత ఇన్ని కేసులు రికార్డవడం ఇదే తొలిసారి. దేశంలో ఎన్నడూ లేని విధంగా 24 గంటల్లో 469 మంది మరణించారు. తాజాగా నమోదైన కేసులతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 1,23,03,131కు పెరిగింది. తాజాగా 50,356 మంది డిశ్చార్జి కాగా.. ఇప్పటి వరకు 1,15,25,039 కోలుకున్నారు. ప్రస్తుతం దేశంలో 6,14,696 యాక్టివ్ కేసులున్నాయని మంత్రిత్వశాఖ తెలిపింది. ఇప్పటి వరకు 1,63,396 మంది మరణించారని చెప్పింది. టీకా డ్రైవ్‌లో ఇప్పటి వరకు 6,87,89,138 డోసులు వేసినట్లు వివరించింది. దేశంలో పెరుగుతున్న కొవిడ్ కేసులతో కేంద్రం అప్రమత్తమైంది. కేసుల పెరుగుదల కనిపిస్తున్న పదకొండు రాష్ట్రాల ప్రతినిధులతో కేంద్ర కేబినెట్ కార్యదర్శి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరస్ కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం

కారుపై కంటైనర్ పడి

నలుగురు దుర్మరణం

జైపూర్,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌లోని పాలీ జిల్లాలోని ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారుపై కంటైనర్ పడిన దుర్ఘటనలో నలుగురు మృత్యువాతపడ్డారు. గుడా ఆండ్లా పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని బాలరాయ్ సమీపంలోని హైవేపై శుక్రవారం ఉదయం 9.30గంటల సమయంలో పాలీ నుంచి సిరోహి వైపు వెళ్తున్న కారుపై పాలరాయి లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ పడింది. లోడ్ కార్‌పై పడడంతో కారు దెబ్బతింది. అందులో ప్రయాణిస్తున్న జంటతో సహా నలుగురు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికి తీసి గుండోజ్‌లోని హాస్పిటల్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ రావత్, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చరిత్రలో నేటినిజం



-రాధశ్రీ



(ఏప్రిల్ 3 రామనాథ్ గోయెంకా జయంతి..)

సెల్: 9494481210

వ్యాక్సినేషన్‌లో ప్రజా నిర్లక్ష్యం

నేటినిజం
శనివారం 3-4-2021

కరోనా వ్యాప్తికి ప్రధానంగా ప్రజల నిర్లక్ష్యమే కారణమని గతేడాదిగా జరుగుతున్న పరిణామాలను బట్టి విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏడాదయినా ప్రజలు జాగరూకతలను పాటించడం లేదు. పోలీసులు ఫైన్ వేస్తామని హెచ్చరించడం లేదా..లాఠీ ఝళిపించడం చేయాల్సి వస్తోంది. చలానా విధిస్తారన్న భయం లేకుండా పోతోంది. తాజా కేసులు చూస్తుంటే కరోనా ఉధృతి మరోమారు తీవ్రంగా ఉంది. వ్యాక్సిన్ వచ్చినా..ఫ్రీగా వేస్తున్నా కూడా ప్రజల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కేసులు పెరగడం,వ్యాక్సిన్ తీసుకోక పోవడం ప్రజల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. వ్యాక్సిన్ వేసుకోవడంలో దుష్ప్రచారాలతో గడపడం కూడా మరింత బాధ్యతారాహిత్యంగానే గుర్తించాలి. ప్రతి ఒక్కరూ విధిగా వ్యాక్సిన్ వేసుకుని దేశాన్ని ప్రమాదం నుంచి తప్పించాలి. ప్రపంచంలో అనేక దేశాల ప్రజలు నేటికీ తమకు వ్యాక్సిన్ ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన హెచ్చరికలు గమనించ ప్రజలంతా త్వరగా టీకా వేసుకోవాలి. మాస్కులు ధరించాలి. ముప్పు రాగానే ప్రభుత్వాలను తిట్టడం మానుకుని మనమెంత వరకు సక్రమంగా ఉన్నామో గమనించాలి. 'జనాభాలో కేవలం 10 శాతం మందికే తొలి టీకా డోసు లభించింది. ఐరోపా సమాఖ్యలో టీకా కార్యక్రమం నెమ్మదిగా సాగుతుండటంపై ప్రపంచ ఆరోగ్య సంస్థపై తాజాగా తీవ్ర విమర్శలు చేసింది. వ్యాక్సినేషన్ కార్యక్రమం ఇంత నెమ్మదిగా సాగడం అసలేమాత్రం ఆమోదయోగ్యం కాదని, దీని వల్ల కరనా సంక్షోభం మరింత కాలంపాటు కొనసాగుతుం దంటూ ఐరపా దేశాలపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నాలుగు శాతం మందే పూర్తి డోసులను తీసుకున్నారని డబ్ల్యూహెచ్‌ఓ ఐరోపా శాఖ అధిపతి హాన్స్ క్లాజ్ తెలిపారు. మునుపటితో పోలిస్తే ప్రస్తుతం ఐరోపాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పేర్కొన్నారు. టీకా ఉత్పత్తిని మరింత వేగవంతం చేసి..టీకా కార్యక్రమానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగించాలని ఆయన సూచించారు. ప్రస్తుత ఐరోపాలో ఉన్న ప్రతి టీకా వయల్‌ను వినియోగించాలని ఆయన స్పష్టం చేశారు. టీకా కార్యక్రమంలో అమెరికా బ్రిటన్‌ల కంటే ఐరోపా బాగా వెనకబడిన విషయం తెలిసిందే. టీకాల కోసం ఆర్డర్లు పెట్టడంతో పాటూ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించడంలో ఐరోపా దేశాలు ఆలస్యం చేసాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇకపోతే మనదగ్గరేమో టీకా ఇస్తున్నా ముందుకు రాకపోవడంతో ఉత్పత్తి వేస్ట్ అవుతోంది. నిజానికి ప్రభుత్వం వ్యాపారదృష్టితో ఆలోచించి వ్యాక్సిన్ ఎగుమతి చేస్తే మనకు ఇచ్చే దిక్కుకూడా ఉండదని ప్రజలు గమనించాలి. నిజానికి తొలినాళ్లలో వచ్చిన హెచ్చరికలను అలాగే కొనసాగించి జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేది. గతేడాది భారత్‌లో ప్రవేశించిన కరోనా వైరస్ శరవేగంగా తన ప్రతాపం చూపించింది. ఆరు నెలలు తిరిగే సరికి ఉగ్రరూపం దాల్చింది. లక్షల కొద్దీ కేసులు.. వేలకొద్దీ మరణాలతో విరుచుకుపడింది. అయితే ఆ తర్వాత నుంచి కాస్త తగ్గినట్లే కన్పించిన ఈ మాయదారి మహమ్మారి తాజాగా మళ్లీ విరుచుకు పడుతోంది. ఇటీవలి కాలంలో మళ్లీ రికార్డు స్థాయిలో కొత్త కేసులు బయటపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఆరు నెలల తర్వాత రోజువారీ కేసులు మళ్లీ 80వేలు దాటడం కలవరానికి గురిచేస్తోంది. అయితే కరోనా తిరగబడుతున్నప్పటికీ వ్యాక్సిన్ పంపిణీ కాస్త ఊరటనిస్తోంది. గతేడాది సెప్టెంబరులో కరోనా మహమ్మారి తీవ్ర స్థాయికి చేరుకుంది. ఆ నెలలో ఏకంగా 11 సార్లు రోజువారీ కేసులు 90వేల పైనే నమోదయ్యాయి. ఆ తర్వాత అక్టోబరు నుంచి వైరస్ తీవ్రత కాస్త తగ్గుముఖం పట్టింది. మాస్కులు, సామాజిక దూరం వంటి నిబంధనలతో పాటు జనవరి నుంచి వ్యాక్సినేషన్ అందుబాటులోకి రావడంతో కొత్త కేసుల సంఖ్య నానాటికీ పడిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరి 15న రోజువారీ పాజిటివ్‌ల సంఖ్య ఏకంగా 10వేల దిగువకు చేరింది. ఆ రోజున 9,139 కొత్త కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఆరంభంలో కరోనాను తరిమికొట్టేందుకు దేశీయంగా భారత్ బయోటెక్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. అలాగే ఆస్ట్రాజెనెకాతో కలసి సీరం సంస్థ కోవిషీల్డ్‌ను రూపొందించింది. ఇలా రెండు స్వదేశీ టీకాలు అందుబాటులోకి వచ్చాయి. జనవరి 16 నుంచి దేశంలో వ్యాక్సిన్ పంపిణీ మొదలుపెట్టారు. అయితే టీకాల రాకతో ప్రజల్లో భరోసాతో పాటు నిర్లక్ష్యం కూడా పెరిగింది. కరోనా మహమ్మారిని తరిమికొట్టాలంటే మన ముందున్న ఏకైక మార్గం వ్యాక్సినేషన్. ప్రస్తుతం మన దేశంలో టీకా పంపిణీ కార్యక్రమం నిరాటంకంగా సాగుతోంది. కరోనా ఉధృతి దృష్ట్యా వ్యాక్సినేషన్ ప్రక్రియను కేంద్రం మరింత వేగవంతం చేసింది. ఏప్రిల్ 1 నుంచి 45ఏళ్లు పైబడిన వారందరికీ టీకాలు అందిస్తోంది. అయితే వ్యాక్సిన్‌తో పాటు జాగ్రత్తలు కూడా అవసరమే అని ప్రభుత్వం, నిపుణులు చెబుతున్నారు. టీకాలు తీసుకున్నప్పటికీ మాస్కులు, ధరించడం, సామాజిక దూరం పాటించడం వంటి నియమాలను మర్చిపోవద్దని సూచిస్తున్నారు. లేదంటే పరిస్థితి చేయి దాటే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ఇకపోతే కరోనా నిబంధనలను పట్టించుకోక పోవడంతో ఇటీవల మహారాష్ట్ర సహా కొన్ని రాష్ట్రాల్లో వైరస్ మళ్లీ విజృంభించింది. దీంతో గత నెలన్నర రోజుల నుంచి కేసులు వేగంగా పెరుగు తున్నాయి. ఇక మహారాష్ట్ర లో అయితే పరిస్థితి ఆందోళనకర రీతిలో ఉంది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న కొత్త కేసుల్లో అధికశాతం ఆ ఒక్కరాష్ట్రంలోనే ఉంటున్నాయి. అయితే భారత్‌లో అత్యధిక రోజువారీ కేసులు నమోదైంది మాత్రం గతేడాది సెప్టెంబరులోనే. అప్పుడు కేసుల సంఖ్య ఏకంగా లక్షకు చేరువై.. ప్రజలను తీవ్ర భయాందోళన లోకి నెట్టేసింది. అయితే కరోనా కేసులు పెరుగుతున్నప్పటికీ రికవరీలు కూడా దాదాపు అదే స్థాయిలో ఉంటుండటం ఊరటనిస్తోంది. గతేడాది సెప్టెంబరు నాటి పరిస్థితిని చూస్తే.. ఆ నెలలో రోజువారీ మరణాలు వెయ్యికి పైనే నమోదయ్యాయి. అత్యధికంగా గతేడాది జూన్ 16న ఒక్కరోజే 2000 మందికి పైగా వైరస్‌కు బలయ్యారు. అయితే అప్పటితో పోలిస్తే ఇప్పుడు మరణాల సంఖ్య తక్కువగానే ఉంటోంది. ఈ లెక్కలు చూసి కాకుండా ప్రజలు ఎవరికి వారు తమ వ్యక్తిగత భద్రతను ఆలోచిస్తే సమాజం బాగుంటుంది. వ్యాక్సిన్ తీసుకోవాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిందే.

కరోనా ఇబ్బందులు ఉన్నా రైతుల కోసం కెసిఆర్ పెద్దమనసు

ఊరూరా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం: మంత్రి వేముల

నిజామాబాద్,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అయినందునే గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గం రామన్నపేట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరోనా ఇబ్బందులు ఉన్నా రైతుల క్షేమం కోసం ఆలోచించి బ్యాంకు రుణం తెచ్చి మరీ రైతుల వద్ద పంట కొనుగోలు చేస్తున్నారన్నారు. అదే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అసలు ధాన్యం కొనుగోలు కేంద్రాలే లేవన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఎత్తివేస్తే రైతుపక్షపాతి అయిన కేసీఆర్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు భరోసాగా నిలిచారన్నారు. అవాకులు, చవాకులు మాట్లాడే బీజేపీ నేతలు దీన్ని గమనించాలన్నారు. వాళ్లకు రాజకీయ ప్రయోజనం తప్పా.. ప్రజా సంక్షేమం పట్టదన్నారు. అలాగే తేమ, తాలు లేని ధాన్యం తీసుకు రావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. గన్నీ సంచుల కొరత లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. నిజామాబాద్ జిల్లాలో 442 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించనున్నామని మంత్రి తెలిపారు.

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

ఆన్‌లైన్ చాటింగ్‌లో మోసపోయిన యువకుడు
డబ్బులు చెల్లించలేక బలవన్మరణం

నిజామాబాద్,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): సైబర్ మోసగాళ్లు బరితెగిస్తున్నారు. యువకుల బలహీనతను అడ్డుపెట్టుకుని యువతుల ద్వారా బ్లాక్ మెయిలింగ్‌కు దిగుతున్నారు. ఇలాంటి ముఠాకు చిక్కిన నిజామాబాద్‌కు చెందిన యువకుడు బలవన్మరణం చెందారు. ఆన్‌లైన్ చాటింగ్‌లో మోసపోయిన ఓ యువకుడు బలవన్మరణం చెందాడు. నిజామాబాద్ జిల్లా నవీపేటకు చెందిన విద్యార్థి హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు. ఓ రోజు అతనికి గుర్తుతెలియని ఫోన్ నెంబర్ నుంచి యువతి కాల్ చేసింది. ఆ తర్వాత కవ్విస్తూ మాట్లాడి రెచ్చగొట్టింది. వీడియో కాల్‌లో నగ్నంగా మారిన ఆ యువతి తనను కూడా అలాగే చేయమని చెప్పింది. యువతి చెప్పినట్లు చేస్తూ ఆ యువకుడు కూడా వీడియో కాల్ చేశాడు. ఆ తర్వాత ఓ గ్యాంగ్ రంగంలోకి దిగింది. యువకుడికి ఫోన్ చేసి తాము అడిగినంత డబ్బు ఇవ్వకపోతే న్యూడ్ ఛాటింగ్ వీడియోను యూట్యూబ్‌లో పెడతామని బెదిరించారు. దీంతో హడలిపోయిన ఆ యువకుడు తాను విద్యార్థినని తన దగ్గర రూ. 24 వేలు మాత్రమే ఉన్నాయని చెప్పి ఆ డబ్బును వారు చెప్పిన అకౌంట్లో వేశారు. అయినా వదలని ఆ గ్యాంగ్ లక్షల్లో డబ్బు కావాలని బ్లాక్ మెయిల్ చేసింది. దీంతో ఆ యువకుడు తీవ్ర ఆందోళన చెందాడు. పరువుపోతుందని మనస్థాపం చెందాడు. మార్చి 27న సొంత ఊరికి వెళ్లిన ఆ యువకుడు పొలంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సికింద్రాబాద్ లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చెట్టంత కొడుకును కోల్పోయిన ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బ్లాక్ మెయిల్ చేసిన గ్యాంగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపి మాలోత్ కవిత పేరు చెప్పి డబ్బు వసూళ్లు

-ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): ఢిల్లీలో తెలంగాణ ఎంపీ మాలోతు కవిత పీఏలమంటూ ముగ్గురు వ్యక్తులు డబ్బులు వసూలు చేశారు. ఢిల్లీలోని ఓ ఇంటి యజమానిని రూ. 5 లక్షల డబ్బులు లంచం ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణం అక్రమం అంటూ ఆ వ్యక్తి దగ్గర డబ్బులు డిమాండ్ చేసినట్టు తెలుస్తోంది. లంచం తీసుకుంటుండగా వారిని సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురు నిందితులు ఎంపీ మాలోతు కవిత అధికారిక క్వార్టర్‌లో పట్టుబడినట్టు సమాచారం. లంచం వసూలు చేసిన వారిని రాజీవ్ భట్టాచార్య, శుభాంగి గుప్త, దుర్గేశ్ కుమార్‌గా గుర్తించింది సీబీఐ. వారిని అరెస్ట్ చేసింది. బాధితుడు మన్మిత్ సింగ్ లాంబా ఇచ్చిన ఫిర్యాదులో రంగంలో దిగిన సీబీఐ.. నిందితులు లక్ష రూపాయలు వసూలు చేస్తుండగా పట్టుకుంది. ఈ కేసు విచారణను సీబీఐ ముమ్మరం చేసింది. అయితే లంచం వసూళ్లకు సంబంధించి తనకు ఎలాంటి సంబంధంలేదని ఎంపీ మాలోతు కవిత తెలిపారు. డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన వాళ్లు ఎవరో కూడా తనకు తెలియదన్నారు. ప్రస్తుతం తాను నా నియోజకర్గంలో ఉన్నానన్న మాలోతు కవిత.. ఇల్లుకు సంబంధించిన కీస్ డ్రైవర్ దుర్గేశ్ దగ్గర ఉంటాయని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ కరోనా వ్యాక్సిన్

ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవాలన్న ఈటెల
అధికారులతో తాజా కేసులపై సమీక్ష

హైదరాబాద్,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): ప్రజలందరికి వ్యాక్సిన్ చేరువ చేసే క్రమంలోగురువారం నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సైతం వాక్సిన్ అందుబాటులోకి తెచ్చినట్టు మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు.

ప్రజలందరూ విధిగా వాక్సిన్ తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన ఆయన.. కరోనా వైరస్‌ను అరికట్టడానికి ప్రస్తుతం వాక్సిన్ తీసుకోవడం ఒక్కటే మార్గమని సూచించారు. వ్యాక్సిన్‌తో ఎలాంటి ప్రమాదం లేదని, అది ప్రమాదానికి దూరంగా ఉంచుతుందని అన్నారు. ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా మహమ్మారిని తరి మేందుకు వ్యాక్సిన్లు అందుబాటులోకి రావడం..

ఇప్పటికే దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ చేపట్టడం జరిగి పోయాయి.. ఇక, ఇవాల్టి నుంచి 45 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరికీ వ్యాక్సిన్ అందిస్తున్నారు.. దానికి తగినట్టుగా ఏర్పాట్లు కూడా చేసింది ప్రభుత్వం.. అయితే, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో వాక్సిన్ అందిస్తున్న విధానంపై మంత్రి ఈటల రాజేందర్ సమీక్ష నిర్వహించారు.. ఈ రోజు నుండి 45 సంవత్సరాలు పైబడిన వారందరికీ వాక్సిన్ అందిస్తున్నామని ఈ సందర్భంగా వెల్లడించిన ఆయన.. ఇప్పటి వరకు మెడికల్ కాలేజీల్లో.. టీవీవీపీ ఆసుపత్రుల్లో మాత్రమే వాక్సిన్ అందిస్తుండగా.. ఇకనుంచి ప్రాథమిక కఆరోగ్÷-య కేంద్రాల్లో కూడా అందుబాటులోకి తీసుకుని వస్తున్నామని తెలిపారు. అంతేకాదు.. కరోనా బారినపడకుండా..

మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం మరవొద్దని గుర్తుచేశారు. మరోవైపు.. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు, డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

మహిళా సాధికారత సాధ్యపడేదెప్పుడూ...!

('గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్-2021' నివేదిక ఆధారంగా)

స్త్రీ పురుష సమానత్వ సాధన భారత దేశంలో విఫలం అవుతున్నదని, గత ఏడాది ప్రపంచ లింగ భేద సూచిక జాబితాతో పోల్చితే మన దేశ స్థానం 28 స్థానాలు పడిపోయిందని తాజాగా విడుదల చేసిన 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్-2021 (ప్రపంచ లింగ భేధ సూచిక-2021)' నివేదిక బట్టబయలు చేసింది. ప్రపంచవ్యాప్తంగా 'వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (ప్రపంచ ఆర్థిక మండలి)' నిర్వహించిన 156 దేశాల 'ప్రపంచ లింగ భేద సూచిక-2021' జాబితాలో ఇండియా 140వ స్థానాన్ని ఆక్రమించడం విచారకరం. గత సంవత్సరం 153 దేశాల జాబితాలో 112వ స్థానంలో ఉన్న ఇండియా ఈ ఏడాది 28 స్థానాల దిగులుకు పడిపోయి 140వ స్థానానికి చేరడం విస్మయానికి గురిచేస్తున్నది. లింగ సమానత్వ సూచిక నిర్ణయించడానికి ఆర్థిక సమానత్వం మరియు ఆర్థిక అవసరాలు, విద్యా సదుపాయాలు, ఆరోగ్యం మరియు మరణాల రేటు, రాజకీయ సాధికారత అనబడే నాలుగు ముఖ్య అంశాలను పరిగణలోకి తీసుకున్నారని నిర్వాహకులు తాజాగా వివరించారు. లింగ సమానత్వ సూచిక జాబితాలో వరుసగా 12వ సారి ఐస్‌లాండ్ 1వ స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషంగా భావించవచ్చు.

భారత్‌లో స్త్రీ పురుష లింగ భేదం రాజకీయ సాధికారతలో అధికంగా కనిపిస్తున్నదని తెలుస్తున్నది. 2019లో మన దేశంలో 23.1 శాతం మహిళా మంత్రులు ఉండేవారని, కాని 2021లో 9.1 శాతానికి పడిపోవడం జరిగిందని తెలుస్తున్నది. మన పార్లమెంట్‌లో మహిళా మంత్రులు 14.4 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. భారత మహిళల పాత్ర వృత్తి మరియు సాంకేతిక రంగాల్లో 29.2 శాతం పడిపోయిందని, మేనేజీరియల్ స్థానాల్లో 14.6 శాతం మహిళలు ఉన్నారని, కంపెనీ అగ్ర స్థానాల్లో 8.9 శాతం మాత్రమే మహిళలు ఉన్నారని నివేదిక తెలిపింది. భారత పురుషుల ఆదాయంతో పోల్చితే స్త్రీల ఆదాయం 20 శాతమే అని విశ్లేషించారు. 156 దేశాల జాబితాలో చివరి 10 దేశాల్లో భారత్ ఉందని తెలిపారు. భారత మహిళల్లో 34.2 శాతం నిరక్షరాస్యులు ఉండగా, పురుషుల్లో 17.6 శాతం మంది మాత్రమే నిరక్షరాస్యులు ఉండటం విద్య అవకాశాల్లో భేదం కనిపిస్తున్నది. 156 ప్రపంచ దేశాల్లో భారత్‌లో రాజకీయ లింగ సమానత్వంలో 51వ స్థానం, మహిళా విద్యలో 114వ స్థానం, ఆర్థిక సమానత్వంలో చివరి పది దేశాల్లో మరియు మహిళా ఆరోగ్య సూచిక జాబితాలో 155న స్థానం దక్కించుకొని, ఓవర్‌ఆల్‌గా 140వ స్థానంలో నిలవడం జరిగింది.

గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్-2021 జాబితాలో లింగ సమానత్వం ఫలితాల్లో 1వ స్థానంలో ఐస్‌లాండ్, 2వ స్థానంలో ఫిన్‌లాండ్, 3వ స్థానంలో నార్వే, 4వ స్థానంలో న్యూజిలాండ్ మరియు 5వ స్థానంలో స్వీడెన్ దేశాలు అగ్రభాగాన ఉన్నాయి. తరువాత స్థానాల్లో నమీబియా, ర్వాండా, లితూనియా, ఐర్లాండ్ మరియు స్విస్జర్‌లాండ్‌లు ఆక్రమించాయి. అగ్ర దేశాలైన యూకె 23వ స్థానం, అమెరికా 30వ స్థానం, ఆస్ట్రేలియా 50వ స్థానం, చైనా 107వ స్థానం, జపాన్ 120వ స్థానాల్లో నిలిచాయి. కరోనా మహమ్మారి కల్లోలకాలంలో లింగ అసమానతలు అతిగా పెరిగాయని నివేదిక తెలుపుతున్నది. లింగ అసమానతలు దక్షిణ ఆసియా దేశాల్లో ఎక్కువగా కనిపించాయనే కఠిన సత్యాన్ని నివేదిక బహిర్గత పరిచింది. బంగ్లాదేశ్(65వ స్థానం) లింగ సమానత్వ సాధన ప్రయత్నాలు సఫలం అయ్యాయని గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రపంచ లింగ సమానత్వ సూచికలో భారత్ 140వ స్థానంలో ఉండగా చివరి స్థానాల్లో ఉన్న దేశాలుగా ఇరాన్(150వ స్థానం), కాంగో (151), సిరియా(152), పాకిస్థాన్(153), ఇరాక్(154), యెమన్(155) మరియు అఫ్ఘనిస్థాన్(156వ స్థానం)లు లింగ సమానత్వ సాధనలో వెనుకబడి ఉన్నాయని తెలుస్తున్నది. లింగ సమానత్వ సాధనకు తూర్పు యూరప్ దేశాలకు 52.1 ఏండ్లు మరియు దక్షిణ ఆసియా దేశాలకు 195.4 ఏండ్లు పడుతుందని వివరించబడింది. ఇండియాలో మాత్రం లింగ సమానత్వం 2020లో 66.8 శాతం ఉండగా, 2021లో మాత్రం 62.5 శాతం రికార్డు అయ్యింది. ఆధునికత శాస్త్రసాంకేతిక ప్రగతి పథంలో అభివృద్ధి సాధించాల్సిన ఇండియా స్త్రీ పురుష అసమానతల విష వలయంలో చిక్కి సతమతం అవుతున్నది. భారత దేశాభివృద్ధి మరియు లింగ సమానత్వ సాధనలకు నిరోధాలుగా అధిక జనాభా, పేదరికం మరియు నిరక్షరాస్యత లాంటివి శాపాలుగా నిలుస్తున్నాయి. మహిళాసాధికారత సాధించడానికి ప్రతి ఒక్కరు తమ ఇంట్లోంచి మార్పుకు నాంది పలకాలని గుర్తుంచుకుందాం. మహిళల్ని అన్ని రంగాల్లో ప్రోత్సహించి పురుష సమానంగా చూద్దాం. ప్రకృతిలో స్త్రీ పురుషులు సమానమని రుజువు చేద్దాం.

- డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

పసుపుబోర్డు ఏర్పాటుకు కవిత కృషి మరువలేనిది

పతంజలి సంస్థతో కూడా మాట్లాడిన విషయం తెలిసిందే
ధర్మపురి అర్వింద్ మాయమాటలు మానాలి: బాజిరెడ్డి

నిజామాబాద్,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): పార్లమెంట్‌లో ఎంపి ధర్మపురి అర్వింద్ పసుపుబోర్డు గురించి ఎందుకు గట్టిగా మాట్లాడరని, కేంద్రమంత్రి పసుపు బోర్డును తిరస్కరిస్తే ఎందుకు నిలదీయడం లేదని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రశ్నించారు. కవిత ఎంపిగా ఉన్న సమయంలో పార్లమెంటులో తన గళాన్ని వినిపించి నిజామాబాద్ పేరును నిలబెట్టారని, గతంలో ఎంపీలు ఎవరైనా ఢిల్లీలో మాట్లాడిన దాఖలాలు ఉన్నాయా అని అన్నారు. ధర్మపురి అర్వింద్ టిఆర్‌ఎస్ నేతలపై విమర్శలు మాని పసుపుబోర్డు కోసం పనిచేయాలన్నారు. బోర్డు కోసం కవిత మ చేయని ప్రయత్నం లేదన్నారు.

ఇదంతా జిల్లా ప్రజలకు తెలుసన్నారు. చివరకు రామ్‌దేవ్ బాబాను పిలిపించి ఇక్కడ పసుపు పరిశ్రమ ఏర్పాటుకు చొరవ తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

అబద్దాల పార్టీ బీజేపీ అనీ, అసత్యాలు మాట్లాడడంలో ఈ పార్టీ నంబర్‌వన్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రమిచ్చే ఆసరా పింఛన్లలో రూ. 800 తావే ఇస్తున్నామంటూ అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారనీ, కేంద్రం ఇచ్చేది 4లక్షల మందికి రూ. 200 చొప్పున మాత్రమేనని చెప్పారు. నలభై లక్షల మందికి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు ఇస్తున్నదని తెలిపారు. ఇకపోతే కెసిఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి పేదలకు అండగా నిలిచారని అన్నారు. పేదవారి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నారమని తెలిపారు. సొంత స్థలం ఉన్న వారికి రూ. 5లక్షలు ఇంటి నిర్మాణం కోసం అందిస్తామనీ, దానిపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు బ్యాంకు లింకేజీ లేకుండా వంద శాతం సబ్సిడీతో రూ. 50వేల చొప్పున రుణాలను అందించామని, వీటిని ఇంకా పెంచి అర్హులందరికీ అందిస్తామన్నారు.

సంక్షేమ కార్యక్రమాలే టిఆర్‌ఎస్ బలం

దేశగతిని మార్చే దమ్ము కెసిఆర్‌కుంది: ఎమ్మెల్యే

జగిత్యాల,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): రైతుబంధు, రైతుబీమా, ఇరవై నాలుగు గంటల కరెంటు ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని, సాగర్ ఉప ఎన్నికలో మరోమారు టిఆర్‌ఎస్ విజయానికి ఇవే కారణాలు అవుతాయని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ధాన్యం కొనుగోళ్లకు మళ్లీ సిఎం కెసిఆర్ ఆదేశాలు ఇవ్వడం అభినందీయనమని అన్నారు. ఆయనకు రైతుల పక్షాన కృతజ్ఞతలు చెబుతున్నామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లోనూ రైతులకు ఇరవై నాలుగు గంటల కరెంట్ ఎందుకు ఇవ్వడం లేదన్నారు. దుబాయి, అమెరికా, సింగపూర్, లండన్ లాంటి ప్రాంతాల గురించి గొప్పగా చెప్పుకుంటామనీ, మరి మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై సంవత్సరాలు దాటినా ఆ ప్రగతి ఇక్కడ ఎందుకు సాధ్యం కావడం లేదని ప్రశ్నించారు. దేశంలోనూ సీఎం కేసీఆర్ లాంటి నాయకుడు ఉంటే, దేశాన్ని అమెరికా, దుబాయి, సింగపూర్ కంటే ఎక్కువగా అభివృద్ధి చేసుకోవచ్చునన్నారు. హైదరాబాద్ నగరం అంత ఉండే దుబాయి గొప్పగా అభివృద్ధి సాధిస్తే, మనం ఎందుకు సాధించలేవో ఆలోచించాలన్నారు. గల్లీలో సమస్యల గురించి పట్టించుకొని, ఢిల్లీలో తెలంగాణ హక్కులు, నిధుల కోసం సైనికుల్లా పోరాడేది కేవలం టీఆర్‌ఎస్ నాయకులే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కెసిఆర్ తలచుకుంటే కీలక పాత్ర పోషించి దేశ గతినే మార్చి వేస్తారని అన్నారు. తెలంగాణ ప్రజల మేలు కోసం సీఎం కేసీఆర్ అనుక్షణం ఆలోచిస్తున్నారనీ అన్నారు. ఒకప్పుడు 200 రూపాయల పెన్షన్ ఉంటే ఇప్పుడు రెండువేలు ఇస్తున్నారనీ, దేశంలో 14 రాష్ట్రాల్లో బీడీ కార్మికులుంటే తెలంగాణలో మాత్రమే బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్నామన్నారు. టీఆర్‌ఎస్ రేషన్ పద్ధతిని ఎత్తివేసి, కడుపు నిండా భోజనం పెడుతోందన్నారు.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఐదేళ్లపాటు ఢిల్లీలో పనిచేశాననీ, పసుపుబోర్డు ఏర్పాటు, బీడీకార్మికుల సమస్యలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, జమ్ముకశ్మీర్ లాంటి విషయాలపైనా ఎంపి కవిత పార్లమెంట్‌లో ప్రస్తావించారన్నారు. బీడీ కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి అందరికీ పెన్షన్ ఇప్పించగలిగారన్నారు. కానీ ఇవన్నీ బిజెపి ఎందుకు చేయడం లేదో చెప్పాలన్నారు.

పల్లెపట్టణం తేడాలేకుండా అభివృద్ధి కార్యక్రమాలు

స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నాం
డోర్నకల్‌లో అనేక కార్యక్రమాలు జరిగాయి: సత్యవతి

మహబూబాబాద్,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): పల్లెపట్టణం అన్న తేడా లేకుండా అంతటా అభివృద్ధి జరుగుతోందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఎక్కడా ఎలాంటి కార్యక్రమం కావాలన్న జరుగుతోందన్నారు. పల్లె, పట్టణ ప్రగతితో స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో అనుకున్నదానికంటే ఎక్కువగానే డోర్నకల్ అభివృద్ధి చెందిందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఎన్నడూలేనివిధంగా డోర్నకల్ ప్రాంతంలో చెరువులు, కాలువలు నీటితో కళకళలాడుతున్నాయని చెప్పారు. మంత్రి ఇవాళ కురవి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలోని గిరిజన యువతకు పెద్ద ఎత్తున స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తున్నారని వెల్లడించారు. బ్యాంకర్లతో సంబంధం లేకుండా ఆర్థిక సహకార పథకాలను అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచాలని, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ మరింత ధృడంగా ఉండాలని, సంక్షేమ ఫలాలను రాష్ట్ర ప్రజలకు అందించేలా ఆయనను దీవించాలని కురవి వీరభద్ర స్వామిని కోరుకున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించగానే కురవి వీరభద్రునికి బంగారు మీసాలు, భద్రకాళి అమ్మవారికి ముక్కు పుడక సమర్పించి సీఎం కేసీఆర్ మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు నిధులు ఇచ్చారని వెల్లడించారు. నాలుగేండ్లు గడిచినప్పటికీ పనులు జరుగుతున్నాయని, వాటిని వీలైనంత తొందరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ వద్ద యువకుల బీభత్సం

హైదరాబాద్, ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): నగరంలోని లంగర్ హౌస్‌లో ఆర్మీ రిక్రూట్‌మెంట్ సెలక్షన్స్ కోసం వచ్చిన అభ్యర్థులు వీరంగం వేశారు. సరైన వసతులు కల్పించలేదంటూ రోడ్డుపైకి వచ్చి హంగామా చేశారు. వాహనాలను అడ్డుకుని బీభత్సం సృష్టించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం తెలుగు రాష్ట్రాల నుంచి అభ్యర్థులు లంగర్‌హౌస్‌కు భారీగా తరలి వచ్చారు. అయితే అధికారులు సరైన వసతులు కల్పించలేదంటూ రభస చేశారు. నడిరోడ్డుపైకి వచ్చి వీరంగం వేశారు. వాహనాలను అడ్డుకున్నారు. ఓ వ్యాన్‌ను అడ్డుకుని అందులోని పాల ప్యాకెట్లు లాక్కుని రోడ్డుపై పారబోసారు. సైన్ బోర్డులను పీకేశారు. యువకులు చేసిన బీభత్సంతో వహనదారులు, ప్రయాణీకులు భయాందోళనకు గురయ్యారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

తార్నాకలో మంటలు అంటుకుని కారు దగ్ధం

హైదరాబాద్,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): : నగరంలోని తార్నాక మెట్రో స్టేషన్ వద్ద ఓ కారులో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. మంటలకు కారు పూర్తిగా దగ్ధమైంది. దీంతో తార్నాక వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. అలాగే పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కారులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా కారులో మంటలకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నోరు జారి కెసిఆర్‌ను విమర్శించిన ఎమ్మెల్యే చల్లా

వరంగల్,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మరోసారి నోరు జారారు. దేశంలో రైతులు 130 రోజులుగా ఉద్యమం చేస్తున్నా....ప్రధాని మోడీ, కేసీఆర్ పట్టుంచుకోలేదంటూ ధర్మారెడ్డి కామెంట్ చేశారు. వరంగల్ రూరల్ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూరులో రైతు వేదికను ప్రారంభించారు ఎమ్మెల్యే. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతాంగం ఇబ్బందులు పడుతుంటే వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి వారిని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రైతులు రోడ్డుపై పడుతున్నా వారిని పిలిచి మాట్లాడకుండా...ఏదో వారికి మేలు చేసినట్టు మాట్లాడడం సరికాదన్నారు. అయితే ప్రధాని మోడీతో పాటు కెసిఆర్‌ను కలిపి విమర్శలు చేసి నాలుక కరుచుకున్నారు. రైతు వేదికలతో రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు మేలు చేస్తున్నామని అన్నారు.

పోచంపాడు ఘటనపై మంత్రి వేముల దిగ్భ్రాంతి

నిజామాబాద్ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): జిల్లాలోని పోచంపాడు పుష్కర ఘాట్‌లోఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి మరణం పట్ల రోడ్లు-భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఖమ్మం పర్యటనలో ఉన్న మంత్రి వేముల విషయం తెలిసిన వెంటనే తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. స్నానానికి గాను గోదావరి నదిలో దిగి దురదృష్టవశాత్తు ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని మంత్రి కోరుకున్నారు. మృతుల కుటుంబాలను అండగా ఉంటామన్నారు.

ఇండియా వరల్డ్ రికార్డు.. 24 గంటల్లోనే రోడ్డు నిర్మాణం: గడ్కరీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: అత్యంత వేగంగా రోడ్డు నిర్మించిన వరల్డ్ రికార్డు ఇండియా పేరిట నమోదైందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం వెల్లడించారు. మార్చిలో ఇలా మూడు వరల్డ్ రికార్డులను నమోదు చేసినట్లు తెలిపారు.

కేవలం 24 గంటల్లో 2.5 కిలోమీటర్ల 4 లేన్ల రోడ్డు నిర్మించినట్లు చెప్పారు. అంతేకాకుండా 24 గంటల్లోనే 25 కిలోమీటర్ల 1 లేన్ రహదారిని షోలాపూర్-బీజాపూర్ మధ్య నిర్మించినట్లు తెలిపారు.

ఫిబ్రవరి 1, 2021 ఉదయం 8 గంటలకు ప్రారంభించిన 2.5 కిలోమీటర్ల 4 లేన్ల రోడ్డును మరుసటి రోజు ఉదయం 8 గంటల కల్లా పూర్తి చేసి వరల్డ్ రికార్డు సృష్టించింది పటేల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.

ఇది నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన కాంట్రాక్టర్. 2020-21 సంవత్సరంలో రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ మొత్తం 13,394 కిలోమీటర్ల పొడువైన రహదారులను నిర్మించింది. నేషనల్ హైవేల నిర్మాణంలో ఇండియా గణనీయ పురోగతిని సాధించినట్లు ఈ సందర్భంగా గడ్కరీ చెప్పారు.

రోజాకు ఫోనులో జగన్ పరామర్శ

తిరుపతి,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): ఇటీవల చెన్నై అడయార్‌లోని ఫోర్టిస్ మలర్ ఆస్పత్రిలో సర్జరీలు చేయించుకున్న ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్, నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల విషయాన్ని పక్కన పెట్టి ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఐదు రోజులుగా చెన్నైలో రోజా చికిత్స పొందుతున్నారు. రెండు మేజర్ ఆపరేషన్లు జరగడంతో ఆమె విశ్రాంతి తీసుకుంటున్నారు.

సెలవుదినాల్లోనూ వ్యాక్సినేషన్

-రాష్ట్రాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): కొవిడ్ వ్యాక్సినేషన్‌ను ఏప్రిల్ నెలలో ఆదివారాలు, పండుగ రోజుల్లోనూ కొనసాగించాలని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం కోరింది. గురువారం నుంచే మూడో విడత వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా ఈ సూచన చేసింది. ఇందులో భాగంగా 45 ఏళ్లు దాటిన అందరికీ వ్యాక్సిన్లు ఇవ్వనున్నారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగం పెంచడంలో భాగంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో సంప్రదించిన తర్వాత కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. జనవరి 16న ఇండియాలో కొవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే ఫిబ్రవరి నుంచి కరోనా కేసులు మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. బుధవారం ఏకంగా 72 వేలకుపైగా కేసులు నమోదయ్యాయి. ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన కేంద్రం వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతంపై చేయడంపై దృష్టి సారించింది.

దేశంలో తగ్గిన విద్యుత్ డిమాండ్

-గత 35 ఏండ్లలో ఇదే తొలిసారి

న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): దేశంలో గత 35 ఏండ్లలో తొలిసారి విద్యుత్ డిమాండ్ తగ్గింది. మార్చితో ముగిసిన 2021 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ డిమాండ్ ఒక శాతం తగ్గింది. గత ఏడాది కరోనా వల్ల విధించిన లాక్‌డౌన్ దీనికి కారణమని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాది మార్చిలో విధించిన దేశవ్యాప్త లాక్‌డౌన్ వల్ల దేశంలో ఆరు నెలలపాటు విద్యుత్ వినియోగం తగ్గింది. గత ఏడాది ఆగస్ట్ నుంచి విద్యుత్ వినియోగంలో పెరుగుదల కనిపించింది. ఈ ఏడాది మార్చి నాటికి విద్యుత్ ఉత్పత్తి 23.3 శాతానికి పెరిగింది. ఫెడరల్ గ్రిడ్ ఆపరేటర్ నుంచి రోజువారీ లోడ్ పంపిణీ డేటా మేరకు రాయిటర్స్ వార్తా సంస్థ ఈ మేరకు విశ్లేషించింది. మొత్తం మీద 2019-20 కంటే 2020-21లో విద్యుత్ ఉత్పత్తి 0.2 శాతం తగ్గిందని పేర్కొంది. గత ఆరు నెలలతో పోల్చితే ఈ ఏడాది మార్చిలో విద్యుత్ ఉత్పత్తి సగటు కంటే 6 శాతం ఎక్కువని తెలిపింది. గత ఆరు నెలుగా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకోవడంతోపాటు ఉత్తర భారతంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల ఏసీల వినియోగం పెరుగడం కూడా దీనికి కారణమని విశ్లేషించింది.

వైభవంగా వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు

సంగారెడ్డి, ఏప్రిల్2 (నేటినిజం ప్రతినిధి): : జిల్లాలోని సుప్రసిద్ధశైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి.

శుక్రవారం గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెంలోని బొంతపల్లి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలను ఈవో శశిధర్‌గుప్తా, వీరన్నగూడెం, బొంతపల్లి ఆలయ వతనుదారులు, మాజీ చైర్మన్ల ఆధ్వర్యంలో అంకురార్పణ చేశారు.

ముందుగా వీరశైవ అర్చకులు సుప్రభాత సేవ చేశారు. మంగళవాయిద్యాలతో వీరభద్రస్వామి వారికి అభిషేకాలు చేశారు. బాలభోగము, తీర్థప్రసాద వినియోగము చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శశిధర్‌గుప్తా స్వామి వారికి, భద్రకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మంగళవాయిద్యాలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. రాత్రి 9 గంటలకు నందీశ్వరవాహన సేవలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమియ్యనున్నారు.

ఇంకెంతకాలం న్యాయం కోసం నిరీక్షించాలి

-వైఎస్ వివేకా హత్యపై కూతురు ఆవేదన

న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణను వేగవంతం చేయాలని ఆయన తనయురాలు సునీతా రెడ్డి కోరారు. ఢిల్లీలో సీబీఐ అధికారులను శుక్రవారం కలసిన ఆమె... అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు దోషులను పట్టుకోలేదు. ఈ విషయమై ఓ ఉన్నతాధికారిని కలిస్తే.. కడప, కర్నూల్‌లో ఇలాంటి ఘటనలు సాధారణం అన్నారు. అయ్యిందేదో.. అయ్యింది.. నీ పోరాటం ఆపెయి.. లేదంటే నీ పిల్లలపై ప్రభావం చూపుతుందని కొంతమంది సూచించారు. నేను ఆశ్చర్యపోయాను. ఏది సరైందన్న ఆలోచనలో పడ్డాను. నా పిల్లల గురించి ఆలోచిస్తూ స్వార్థపరురాలిగా ఉండిపోవాలా అనిపించింది. నేను రాజకీయవేత్తను ... సామాజిక కార్యకర్తను కాదు. మానాన్న ఓ మాజీ ముఖ్యమంత్రికి సోదరుడు. ప్రస్తుత ముఖ్యమంత్రికి బాబాయి. అంతటి వ్యక్తికే ఇలా జరిగితే... సామాన్యుల పరిస్థితి ఏంటి? ఇప్పటికే ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తి మరణించాడు. విచారణ ఆలస్యమైతే.. రేపటి రోజున సాక్షులు కూడా ముందుకు రారు. న్యాయం కోసం ఇంకెంత కాలం నిరీక్షించాలని ఆమె అన్నారు.

ఢిల్లీలో లాక్‌డౌన్ విధించే యోచన లేదు: సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఏప్రిల్2: దేశ రాజధాని ఢిల్లీలో లాక్‌డౌన్ విధించే యోచన లేదని సీఎం అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో ఆరోగ్య మంత్రి సత్యేంద్ర జైన్, ఇతర అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో కరోనా కేసుల పెరుగుదల, నియంత్రణ చర్యలపై వారితో చర్చించారు. గత కొన్ని రోజులుగా కరోనా కేసులు పెరుగుతున్నాయని, గత 24 గంటల్లో 3,583 కొత్త కేసులు నమోదయ్యాయని తెలిపారు.

ఢిల్లీలో నాలుగోసారి కరోనా విజృంభిస్తున్నదని కేజ్రీవాల్ అన్నారు. అయితే ఎలాంటి భయాందోళన అవసరం లేదని, నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కరోనా టీకాలపై దృష్టిసారించామని, గురువారం 71 వేల మందికి వ్యాక్సిన్ వేసినట్లు వివరించారు.

సునీల్ మృతికి కెసిఆర్ బాధ్యత వహించాలి

-ఉద్యోగాల భర్తీలో ఆలస్యానికే యువతలో ఆందోళన: జీవన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థి సునీల్ మరణానికి ముఖ్యమంత్రి కేసీఆరే బాధ్యత వహించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేయడం లేదని మనస్తాపం చెందిన కేయూ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై స్పందించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో ఉద్యోగ ఖాళీలుంటే 50 వేలు భర్తీ చేస్తామనడం దారుణమన్నారు. ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసు పెంపు నిరుద్యోగులను మోసం చేయడమేనని విమర్శించారు. విద్యార్థి సునీల్ మరణాన్ని ఎన్‌హెచ్‌ఆర్సీ దృష్టికి తీసుకెళ్తామని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేయడం లేదని మనస్తాపం చెందిన కేయూ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. 10 రోజుల క్రితం బొడ్డ సునీల్ అనే విద్యార్థి పురుగుల మందు తాగగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమించడంతో హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. వరంగల్ రూరల్ జిల్లా గూడూరు మండలం, తేజావత్ రామ్సింగ్ తండాకు చెందిన సునీల్ విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసే వాడు.. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోవడంలేదని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు

పదికోట్ల కుంభకోణంపై నోరుమెదపని నేతలు

అధికార పార్టీలో ఎవరు సూత్రధారులో తేలేదెలా?

ఖమ్మం,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): గతంలో వరంగల్ సహకార బ్యాంక్‌లో అవినీతి జరిగిందని నానా యాగీ చేసిన టిఆర్ఎస్ నేతలు ఇప్పుడు కమ్మంలో అంతకు మించిన అవినీతి జరిగితే కిమ్మనడం లేదు. ఖమ్మంలో అధికారిక కార్యక్రమాల్లో ఉన్న ముగ్గురు మంత్రులు కూడా నోరుమెదపలేదు. అధికార పార్టీ నేతలే ముందుండి అంతా పంచుకున్నారని కోడై కూస్తున్నా పట్టింపులేదు. పది కోట్ల నిధులు గల్లంతయితే నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండడం అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లా రాజకీయాలు వీటి చుట్టూనే తిరుగుతున్నాయి.

సహకార బ్యాంక్ మాజీ ఛైర్మన్ సహా ముగ్గురు సీఈవోలు, 21 మంది డైరెక్టర్లపై కేసు పెట్టడంతో అలజడి రేగుతోంది. దీని వెనక ఎవరున్నారు? ఎందుకు కేసు పెట్టారు అని ఆరా తీస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, ఆయన పాలకవర్గంలోని 21 మంది డైరెక్టర్లపై కేసు నమోదు సంచలనంగా మారింది. ఈ కేసు నమోదు వెనక ఎవరు ఉన్నారు? రాజకీయ విభేదాలే కారణమా? ఓ నేత అనుచరులపైనా కేసు పెట్టడం ద్వారా ఎలాంటి సంకేతాలు పంపారు? అని జిల్లాలోని అధికార పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కేవలం గత పాలకవర్గంతో వదిలిపెట్టకుండా ముగ్గురు పాత సీఈవోలపైనా కేసు కట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. మొత్తానికి జిల్లా టీఆర్ఎస్‌లో ఉన్న వర్గపోరు అటు తిరిగి ఇటు తిరిగి బ్యాంకుపై కేసు రూపంలో బయటపడింది. కాకపోతే ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యగా ఎవరూ విమర్శించకుండా తన అనుచరుడైన బ్యాంక్ వైస్‌ఛైర్మన్‌పై కూడా సదరు నేత కేసులో పెట్టారని చర్చ జరుగుతోంది. రానున్న రోజుల్లో పదికోట్ల బ్యాంకు కథ ఇంకెలాంటి రాజకీయ కక్షలకు వేదిక అవుతుందో చూడాలి.

అయితే మరోమలుపు ఏంటంటే.. ఖమ్మం డీసీసీబీలో జరిగిన నిధుల మళ్లింపు వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని, అప్పటి చైర్మన్, సహకారశాఖ అధికారులదే బాధ్యత అని గత పాలకమండలి డైరెక్టర్లు పేర్కొన్నారు. ఇటీవల ఉన్నతాధికారుల నివేదికతో నిధుల వ్యవహారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. విజయబాబు బ్యాంకు ఛైర్మన్‌గా ఉన్న సమయంలో రైతుల కోసం ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఇది జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు అనుబంధంగా ఉండే ఆస్పత్రి. దేశంలో ఎక్కడా సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో ఆస్పత్రులు లేవు. దాంతో బ్యాంకు నిధులను మళ్లించడానికే ఆస్పత్రిని తెరపైకి తీసుకొచ్చారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. అదే ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థులకు అస్త్రంగా మారినట్టు చెబుతున్నారు. పదవీ కాలం ముగిసిన తర్వాత విజయ్‌బాబు ట్రస్ట్‌లోని ప్రైవేట్ వ్యక్తులకు ఆస్పత్రిని అప్పగించడం కూడా మరో వివాదానికి కేంద్రబిందువైంది. ఆస్పత్రి నిర్మాణానికి రైతు సంక్షేమ నిధి పేరుతో 6 కోట్ల 13 లక్షలు, ఉద్యోగులకు బహుమతులు, డైరెక్టర్లకు వెండి ప్రతిమలకు మరో 63 లక్షలు కేటాయించారట. విజ్ఞాన పర్యటన కోసం మరో 55 లక్షలు ఖర్చు చేశారని సమచారం. వీటన్నింటిలోనూ అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో కేసు పెట్టి తదుపరి చర్యలపై ఫోకస్ పెట్టారు. డీసీసీబీ పాలకమండలిలో సభ్యులుగా ఉన్న ప్రస్తుత డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, గత, ప్రస్తుత డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు తదితరులు ఈ వ్యవహారంపై స్పష్టత ఇచ్చేందుకు యత్నించారు. డీసీసీబీలో నిధుల మళ్లింపు మాట వాస్తవమేనని, ఇది నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని, దీనికి పాలకమండలి చైర్మన్‌తోపాటు పాలకమండలిలో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్న డీసీసీబీ సీఈవో, నాబార్డు డీజీఎం, టెస్కాబ్ ఏజీఎంలదే బాధ్యతని తెలిపారు. చట్టానికి, నిబంధనలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే వెంటనే అధికారులు సభ్యులకు తెలియచేయాలని, అలా తెలియజేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు తెలిపారు. పాలకమండలి చైర్మన్‌కు నిధులు, పరిపాలన వ్యవహారంలో పూర్తిబాధ్యత ఉంటుందని, డైరెక్టర్లు బోర్డు సమావేశానికి రావడం, అభిప్రాయాలు చెప్పడం తప్ప.. పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోరని, రోజువారీ విధులను చైర్మన్‌తోపాటు అధికారులే చూసుకుంటారని వివరించారు. రైతుసంక్షేమనిధికి నిధులు మళ్లింపు విషయమై అప్పట్లో జరిగిన సమావేశంలో తమ అభిప్రాయంగా ఈ ప్రక్రియ వద్దని చెప్పామని, అయినా నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. అయితే బోర్డుసభ్యుల ప్రమేయం లేకుండానే పాలకమండలి నిర్ణయాలు జరుగుతాయా అన్నదానికి సమాధానం లేదు. ఏది ఎలా ఉన్నా దీనిపై విచారణ జరిపితే అక్రమాలు బయటకు వస్తాయి. దోషులెవరో తేలుతుంది. దీనికి ఎవరు సూత్రధారులో తేలుతుంది.

తిరుపతిలో మండుతున్న ఎండలు

రాజకీయ ప్రచారంలో చెమటోడుస్తున్న నేతలు
ఎండలతో వెనకడుగు వేస్తున్న కార్యకర్తలు

తిరువతి,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): తిరుపతిలో ఎండలు మండుతున్నాయి. మండుటెండల్లో రాజకీయ నేతలు ఉక్కపోతకు గురవుతున్నారు. ప్రచారంలో దస్సిపోతున్నారు. వచ్చే నెల 17న జరిగే ఉప ఎన్నికల్లో విజయే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు చెమటోడుస్తున్నారు. వారితో పాటు పార్టీ నేతలు కూడా అపసోపాలు పడుతున్నారు. మరోవైపు తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రచారం కానీ కార్యకర్తలు మాత్రం ఉత్సాహంగా ముందుకు రావడం లేదు. అధికార పక్షం కంటే ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ ప్రచారంలో జోరు పెంచింది. బీజేపీ ఇంకా క్షేత్రస్థాయి ప్రచారానికి దిగలేదు. అదే సమయంలో జనసేన పార్టీ శ్రేణులేవీ ఉప ఎన్నికల కార్యక్షేత్రంలో కనిపించడం లేదు. ఇప్పటి దాకా చాలావరకూ సమావేశాలు, సమీక్షలకే పరిమితమవుతూ వచ్చిన ప్రధాన పార్టీల నేతలు ఇప్పుడిప్పుడే జనంలోకి వెళుతున్నారు. తిరుపతి ఉప ఎన్నికల్లో అధికార వైకాపా, టీడీపీ ప్రచార జోరు పెంచింది. మంత్రి కురసాల కన్నబాబుతో కలిసి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సుడిగాలి ప్రచారం నిర్వహించారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లోని పలు గ్రామాల్లో వారు జనంలోకి వెళ్లి పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రచారం చేశారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి కార్యకర్తలతో కలసి ప్రారం చేశారు. తిరుపతిలో అభ్యర్థి గురుమూర్తితో పాటు ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కేవీబీపురంలో ఎమ్మెల్యే ఆదిమూలం వైసీపీ అభ్యర్థి గెలుపునకు ప్రచారం చేపట్టారు. టిడిపి అభ్యర్థి పనబాక లక్ష్మి పలు డివిజన్ల పరిధిలో సుడిగాలి పర్యటన జరిపారు. ఈ ప్రాంతాల్లో స్థానిక నేతలతో కలసి ప్రచారం చేపట్టారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహయాదవ్, ముఖ్యనేతలు పాల్గొంటున్నారు. మాజీ హోంశాఖ మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, చిత్తూరు లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నానీ తదితరులు తొలుత బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తొట్టంబేడు మండలంలో బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రచారం చేపట్టగా, సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, పుంగనూరు టీడీపీ నేత నూతనకాల్వ శ్రీనాథరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నేత నిమ్మగడ్డ సత్యసాయి తదితరులు పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. సత్యవేడు మండలంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, నూతనకాల్వ శ్రీనాథరెడ్డి బూత్ కమిటీలతో సమావేశమయ్యారు. నారాయణవనంలో సత్యవేడు టీడీపీ ఇంఛార్జి జేడీ రాజశేఖర్, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తదితరులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీజేపీ ఇప్పటి వరకూ సమావేశాలు, సమీక్షలకే పరిమితమవుతూ వస్తోంది. ఇంతవరకు ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేపట్టడం లేదు. ఒకట్రెండు మండలాల్లో స్థానిక నేతలు, కార్యకర్తలు మాత్రమే ప్రచారంలో పాల్గొంటున్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు మాత్రం సమావేశాలు, పరిచయ కార్యక్రమాలతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నారు. తిరుపతిలో జరిగిన బీజేపీ-జనసేన సమన్వయ కమిటీ సమావేశానికి నగర జనసేన అధ్యక్షుడు మినహా ముఖ్యనేతలెవరూ హాజరు కాలేదు. కేవలం తిరుపతిలోనే కాకుండా శ్రీకాళహస్తి, సత్యవేడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కూడా జనసేన నాయకులు, కార్యకర్తలు ఇంతవరకూ ఉప ఎన్నికల కార్యక్షేత్రంలో కనిపించడంలేదు. తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో ప్రత్యామ్నాయంగా ముందుకొస్తున్న సిపిఎం ఎంపి అభ్యర్థి నెల్లూరు యాదగిరికి ఓటేసి గెలిపించాలని, మతోన్మాద బిజెపితో పాటు అవకాశవాద పార్టీలు టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లను ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు పిలుపునిచ్చారు. తిరుపతి ఎంబి భవన్‌లో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార జాతాను సిపిఎం జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య జెండా ఊపి ప్రారంభించారు. పి.మధు డప్పుకొట్టి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా పి.మధు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయకపోవడం దారుణమన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించి, దళితులకు రిజర్వేషన్లు లేకుండా ఎత్తేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు

కావాలనే అర్బన్ నక్సల్స్‌గా ముద్ర వేస్తున్న కేంద్రం
మండిపడ్డ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్

హైదరాబాద్,ఏప్రిల్2 (అంఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో 31 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. శ్రీకాకుళం, విశాఖ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, తూర్పు, పశ్చిమ గోదావరి, కడపలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. మావోయిస్టులకు సమాచారం ఇస్తున్నారనే ఆరోపణలపై సోదాలు నిర్వహించిన ఎన్ఐ ఏ అధికారులు.. ఆరుగురిని అరెస్ట్ చేశారు. పంగి నాగన్న, అందులూరి అన్నపూర్ణ, జంగిరాల కోటేశ్వరరావు, మణికొండ శ్రీనివాసరావు, రేల రాజేశ్వరి, బొప్పిడి అంజమ్మను అరెస్ట్ చేశారు. 40 సెల్‌ఫోన్లు, 44 సిమ్‌కార్డులు, 70 హార్డ్‌డిస్కులు ఎన్ఐఏ సీజ్ చేసింది. మైక్రో ఎస్‌డీ, 180 సీడీలు, 19 పెన్‌డ్రైవ్‌లు, ఆడియో, వీడియో టేప్స్, రూ.10 లక్షలు, పెద్దఎత్తున మావోయిస్టు సాహిత్య పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రజా సంఘాల నేతల ఇళ్లలో ఎన్ఐఏ సోదాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పౌరహక్కుల సం ఘం అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రకటించారు. గురు వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అక్రమ అరెస్టులతో, ప్రజా సంఘాల నాయకులను ఎన్ఐఏ టార్గెట్ చేస్తోందని ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేస్తున్నారని తప్పుబట్టారు. రాజ్యాం గానికి వ్యతిరేకంగా ఎన్ఐఏను ఏర్పాటు చేశారని, ఎన్ఐఏను ఉపసంహరించు కోవాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. చట్ట వ్యతిరేక కార్యకాపాల నిరోధక చట్టం(ఉపా చట్టం)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు చేసి, వారు తెచ్చిన మెటీరి యల్ ఇంట్లో పెట్టి మావోలతో సంబం ధా లు ఉన్నాయని కేసు లు పెడుతున్నారని ఆరో పిం చారు. బుధవారం ఒక్క రోజు రెండు రాష్ట్రాల్లో 27 మందిని ఎన్ఐఏ విచారించిందని లక్ష్మణ్ తెలిపారు. హైదరా బాద్‌లో ప్రజా సంఘాల నేతల ఇళ్లలో ఎన్ఐఏ సోదాలు చేసింది. ఏపీలోని విశాఖపట్నం జిల్లా మంచంగిపుట్టు పోలీస్ స్టేషన్‌లో ప్రజా సంఘాల నేతలపై నమోదైన కేసు ఎన్ఐఏకి బదిలీ అయింది. 64 మంది ప్రజా సంఘాల నేతలపై ఎన్ఐఏ హైదరాబాద్ విభాగం ఉపా కేసు నమోదు చేసింది. నిషేధిత మావోయిస్టు పార్టీతో వారికి సంబంధాలు ఉన్నాయని అభియోగాలు మోపింది. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు జాను, రాష్ట్ర కార్యదర్శి కోటి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు దేవేంద్ర, జననాట్యమండలి నాయకుడు డప్పు రమేశ్ ఇళ్లలో బుధవారం రాత్రి వరకు సోదాలు కొనసాగాయి. మంచంగిపుట్ట, పిడుగురాళ్ల కేసులను కొట్టివేయాలంటూ ప్రజాసంఘాల తరపున అడ్వకేట్ రఘునాథ్ వాదిస్తున్నారు.

పుణెలో కరోనా మరింత విజృంభణ

-వారంపాటు మాల్స్, థియేటర్లు,బార్లు మూసివేత

పుణెళి,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): పుణెలో కరోనా మరింత విజృంభిస్తోంది. దీంతో కట్టడి చర్యలకు ప్రభుత్వం పూనుకుంది. కోవిడ్-19 కేసులు మరింత పెరగకుండా నిరోధించేందుకు మాల్స్, సినిమా థియేటర్లు, బార్, రెస్టారెంట్లను వారం రోజులపాటు మూసివేయాలని అధికారులు ఆదేశించారు. అయితే పూర్తి స్థాయిలో అష్టదిగ్బంధాన్ని విధించరాదని నిర్ణయించారు.

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పుణెళి డివిజినల్ కమిషనర్ సౌరభ్ రావ్ శుక్రవారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం, కోవిడ్-19 మహమ్మారి నిరోధం కోసం నూతన మార్గదర్శకాలను జారీ చేశారు. నగరంలోని అన్ని మాల్స్, బార్లు, రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు, హోటళ్లను రానున్న ఏడు రోజులపాటు మూసివేయాలని నిర్ణయించారు. అయితే హోం డెలివరీపై ఆంక్షలు విధించలేదు. పీఎంపీఎంఎల్ బస్సు సర్వీసులు, దేవాలయాలు, మతపరమైన ప్రార్థనా మందిరాలను కూడా రానున్న ఏడు రోజుల పాటు మూసివేయాలని నిర్ణయించారు. వారం వారం జరిగే సంతలను కూడా నిర్వహించడానికి అనుమతించరాదని నిర్ణయించారు. భౌతిక దూరం పాటించాలని, మాస్కులు ధరించాలని ప్రజలను కోరారు. వివాహాలను గరిష్ఠంగా 50 మందితో అంత్యక్రియలకు గరిష్ఠంగా 20 మందితో మాత్రమే నిర్వహించడానికి అనుమతిస్తారు. ఇతర కార్యక్రమాలకు అనుమతి ఇవ్వబోరు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి ఆ మర్నాడు ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ విధించాలని నిర్ణయించారు. వైద్యపరమైన అత్యవసర పరిస్థితిలో మాత్రమే బయటికి రావడానికి అనుమతిస్తారు. పగటిపూట ఐదుగురి కన్నా ఎక్కువ మంది ఒక చోట ఉండటానికి అనుమతించబోరు. ఈ ఆదేశాలు శనివారం నుంచి అమల్లోకి వస్తాయి. వచ్చే శుక్రవారం పరిస్థితిని అధికారులు సమీక్షిస్తారు. ఇదిలావుండగా, ఆరోగ్య శాఖాధికారులు వెల్లడించిన సమాచారం ప్రకారం, పుణెళి నగరంలో గురువారం కొత్తగా 8,011 కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

బుధవారం నమోదైన కేసుల సంఖ్య 8,605. దీంతో నగర మేయర్ మురళీధర్ మొహోల్ గురువారం స్పందిస్తూ, 80 శాతం పడకలను కోవిడ్ రోగుల కోసం అందుబాటులో ఉంచాలని ప్రైవేటు ఆసుపత్రులను కోరారు.

రాబర్ట్ వాద్రాకు కరోనా పాజిటివ్

-సెల్ఫ్ ఐసోలేషన్‌లో ప్రియాంక దంపతులు

న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ అల్లుడు, ప్రియాంకాగాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు కరోనా వైరస్ సోకింది. తాజాగా ఆయన కరోనా నిర్థారణ పరీక్షలు చేయించుకోగా పాజిటివ్ వచ్చింది. దాంతో ఆయన సెల్ఫ్ ఐసోలేషన్‌లోకి వెళ్లారు. ఆ తర్వాత ప్రియాంకాగాంధీ వాద్రా కూడా కరోనా నిర్థారణ పరీక్షలు చేయించుకోగా ఆమెకు నెగెటివ్ వచ్చింది. అయినప్పటికీ ముందుజాగ్రత్తగా వాద్రాతోపాటు ఆమె కూడా సెల్ఫ్ ఐసోలేషన్‌లో ఉండిపోయారు. తనకు పరీక్షల్లో నెగెటివ్ వచ్చినప్పటికీ కొద్ది రోజుల పాటు ఐసోలేషన్?లో ఉండాలని డాక్టర్లు సూచించినందు వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్విట్టర్ లో షేర్ చేసిన ఓ సెల్ఫీ వీడియోలో ప్రియాంక గాంధీ తెలిపారు.

ఈ నేపథ్యంలో అసోం, తమిళనాడు,కేరళ రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. కొద్ది రోజులగా ప్రియాంక గాంధీ అసెంబ్లీ ఎన్నికలున్న అస్సాం, కేరళ రాష్ట్రాలలో చురుకుగా ప్రచారం చేస్తున్నారు. తమిళనాడులోనూ ప్రచారం చేసేందుకు సిద్ధమయ్యారు. ఆమె ఇప్పటివరకు అస్సాంలో రెండుసార్లు పర్యటించగా.. మూడోసారి ఇవాళ పర్యటించాల్సి ఉంది. ఇంతలో కరోనా విషయం తెలియడంతో ప్రియాంక గాంధీ తన పర్యటనను రద్దు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగే ర్యాలీలలో కూడా ఆమె ప్రసంగిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. కానీ, ఆ పర్యటన కూడా రద్దు అవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశకు గురయ్యాయి.

ప్రజల ఆవేదనకు అద్దం పడుతున్న స్టీల్ ప్లాంట్ ఆందోళన

-మోడీ వ్యవహార శైలిపై మండిపడ్డ కాంగ్రెస్ నేత విహెచ్

విశాఖపట్నం,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): ప్రజల ఆవేదనకు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఉద్యమం అద్దం పడుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతురావు అన్నారు. లక్షల మందికి జీవనోపాధి విశాఖ స్టీల్ ప్లాంట్ అని పేర్కొన్నారు. అబద్దాలు చెప్పడంలో నరేంద్ర మోదీ నెంబర్ వన్ అని... ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని మోసం చేశారని మండిపడ్డారు. భారతదేశాన్నే ఒకేసారి అమ్మేస్తాడు ఏమో? అంటూ యెద్దేవా చేశారు. తెలుగువారికి అన్యాయం జరిగితే తెలుగు ప్రజలు కలిసి పోరాడుతారని స్పష్టం చేశారు. తాను స్టీల్ ప్లాంట్ ఉద్యమానికి పూర్తిగా మద్దతు ఇస్తున్నానని...ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని వీహెచ్ తెలిపారు. ఎదుటిపార్టీలను బెదిరించి రాజకీయాలు చేయడం, ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించిన వారిపట్ల అమానుషంగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఉక్కు ఆంధ్రుల శాశ్వత హక్కు అని.. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలనే అనే భావన ప్రజల్లో ఉందని మాజీ ఎంపీ హర్షకుమార్ పేర్కొన్నారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో శిబిరాన్ని ప్రారంభిస్తే, మరింత ఒత్తిడి పెరుగుతుందన్నారు. పార్టీల అభిప్రాయాలు వేరుగా ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అఖిలపక్షంగా ఏర్పడి ఢిల్లీలో పోరాటం చేయాలని హర్షకుమార్ పేర్కొన్నారు. ఇదిలావుంటే కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను చేపడుతుందని, స్టీల్‌ప్లాంట్ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రజా, పౌర సంఘాల నేతల ఇళ్లపై ఎన్ఐఏ చేత దాడులు చేయిస్తోందని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిని అణచివేసేందుకు ఉపా చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. పేదలకు జరిగిన అన్యాయంపై వారి తరఫున వాదించే న్యాయవాదులపై కూడా దాడులు చేయడం శోచనీయమన్నారు. ఎన్ఐఏ అధికారులు ప్రజా సంఘాల నేతల ఇళ్లపై అక్రమంగా దాడులు, సోదాలు చేయకూడదని హైకోర్టు ఇచ్చిన రిలీఫ్ ఆర్డర్‌ను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజల హక్కుల కోసం ప్రశ్నించే వారిపై కేంద్రం ఉపా చట్టాన్ని ప్రయోగిస్తుందన్నారు.

రేషన్ డీలర్ల ఆందోళన

విజయవాడ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): కృష్ణా జిల్లా మోపిదేవి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద రేషన్ డీలర్లు ఆందోళన చేపట్టారు. పంపిణీ కేంద్ర కంప్యూటర్ ఆపరేటర్, ఇంచార్జ్‌ల వ్యవహార శైలిపై డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళా డీలర్ ఈ పోస్ మెషీన్ పగులకొట్టి అమర్యాదగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఇంత జరుగుతున్నా స్టాక్ పాయింట్ సిబ్బంది పత్తాలేకుండా పోయారు.

ప్రత్యేకహోదా రాదని తెలిసే రాజకీయాలు

వైకాపా తీరుతో ఎపికి పెట్టుబడులు రావడం లేదు
మీడియా సమావేశంలో ఎంపి సుజనా చౌదరి

తిరుపతి,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): ఏపీకి హోదా పేరుతో కొన్నిపార్టీలు రాజకీయం చేస్తున్నాయని బీజేపీ ఎంపీ సుజనా చౌదరి విమర్శించారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఉపఎన్నికలో బీజేపీని గెలిపిస్తే తిరుపతి అభివృద్ధి చెందుతుందని అన్నారు. విభజన చట్టంలో ఉన్నవాటితో పాటు లేనివి కూడా ఏపీకి కేంద్రం ఇచ్చిందన్నారు. ప్రత్యేక హోదాను వైసీపీ, టీడీపీలు రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నా యని ఆరోపించారు. పుదుచ్చేరికి హోదా ఇచ్చారంటూ బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రధానమంత్రి అయినా ఏపీకి హోదా ఇవ్వలేరని అన్నారు. ఎందుకంటే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు హోదా కుదరదని ఆర్థిక సంఘం చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యేల తీరుతో రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదని సుజనాచౌదరి అన్నారు.

వైసీపీ నేతల తీరుతో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలంటే కంపెనీలు భయపడుతున్నాయని, ఉన్న కంపెనీలు వెళ్లిపోతున్నాయని సుజనా చౌదరి అన్నారు. శుక్రవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీకి 22 మంది ఎంపీలను గెలిపిస్తే ఏపీకి ఏం సాధించారని ప్రశ్నించారు. తప్పుడు నిర్ణయాలు తీసుకుంటూ దేశంలో ఏ ప్రభుత్వం ఇంతగా కోర్టులతో మొట్టికాయలు వేయించుకోలేదని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన వాటిని అడిగే పరిస్థితి కూడా లేదని విమర్శించారు. ఇకనైనా ప్రజలు వైసీపీకి ఓట్లు వేసి ఓట్లను దుర్వినియోగం చేసుకోవద్దని సుజనా చౌదరి సూచించారు.

తాగి సెంట్రింగ్ కార్మికుల గొడవ

విజయవాడ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): నగరంలోని అజిత్ సింగ్ నగర్ పైపుల్ రోడ్ సెంటర్ సమీపంలోని దుర్గా బజార్ సెంటర్లో రోడ్లపై సెంట్రింగ్ కార్మికులు కత్తులతో స్వైర విహారం చేశారు. సెంట్రింగ్ కార్మికుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మద్యం మత్తులో వంద రూపాయల కోసం కార్మికులు కొట్టుకున్నారు. ఈ దాడిలో వాంబే కాలనీ ప్రాంతానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు పండు మృతి చెందాడు. ముగ్గురికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏసు బోధనల సారాన్ని గ్రహించాలి: పవన్ కళ్యాణ్

అమరావతి,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): ఏసు క్రీస్తు బోధనల సారాన్ని మానవాళి గ్రహించాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. పాపుల్ని ద్వేషించొద్దని... క్షమించమని చెప్పిన ప్రేమమూర్తి ఏసు క్రీస్తు అంటూ తన ప్రకటనలో పవన్ పేర్కొన్నారు. దైవ కుమారునికి శిలువ వేసిన సమయాన్నే గుడ్ ÷-రెల్గ÷డేగా క్రైస్తవ సోదరులు నిర్వహించుకుంటున్నారని, సమస్త మానవాళి ఏసు క్రీస్తు బోధనల సారాన్ని గ్రహించడం అవసరమన్నారు. శిలువ వేసిన సమయంలో క్రీస్తు చెప్పిన ఏడు అమర వాక్యాలని గుర్తు చేసుకోవాలన్నారు. నిరంతరం పొరుగువారికి ప్రేమను పంచుతూ, క్షమా గుణంతో జీవించాలన్న క్రీస్తు జీవన ప్రస్థానాన్ని గుడ్ ÷-రెల్గ÷డే సందర్భంగా స్మరించుకోవాలని పవన్ అన్నారు.

ఐటి విస్తరణకు సిఎక్స్ఓ సదస్సు

-మీడియాతో మంత్రి మేకపాటి వెల్లడి

విజయవాడ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): ఐటీ పరిశ్రమ విస్తరణ కోసమే సీఎక్సఓ సదస్సు నిర్వహిస్తున్నామని ఐటీ శాఖ మంత్రి గౌతమ్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని, ఐటీ మౌలిక వసతులు కల్పించడంపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. రెండు వేల ఎకరాలలో 3 కాన్సెప్ట్ సిటీలను నిర్మించబోతున్నామని వెల్లడించారు. ఫైబర్ నెట్ ద్వారా ప్రతి గ్రామానికి 2024 నాటికి ఇంటర్నెట్ అందిస్తామన్నారు. ప్రతి గ్రామంలో డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ బ్రాడ్ బ్యాండ్ ఏర్పాటు చేస్తామని మంత్రి గౌతమ్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలతో ఐటీ రంగాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. పాదయాత్రలో సీఎం జగన్ ప్రజల సమస్యలు తెలుసుకున్నారని.. అందుకే నాణ్యమైన విద్య, వైద్యం అందించేలా సంస్కరణలు తెచ్చారన్నారు. విద్యారంగంలో విద్యాకానుక పథకం సహా అనేక పథకాలు తెచ్చారని.. ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య,వైద్యం కోసం పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ అభివృద్ధి, నాణ్యమైన మానవ వనరుల తయారీకి కృషి చేస్తున్నామన్నారు. కోవిడ్ వల్ల తీవ్ర ఇబ్బందులు వచ్చాయని.. అలాంటి సమయంలో ఎంఎస్ఎంఈ పరిశ్రమలను ఏపీ ప్రభుత్వం ఆదుకుందన్నారు. జగనన్న తోడుతో చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాల కల్పనకు సహకరించామని మంత్రి గౌతమ్‌రెడ్డి తెలిపారు.ప్రతి పథకాన్నినేరుగా లబ్దిదారులకు ప్రభుత్వం అందిస్తోందన్నారు.

ఏపీలో కొత్తగా 1,288 కరోనా కేసులు

అమరావతి, ఏప్రిల్ 2 : ఏపీలో కరోనా ఉధృతి కొనసాగుతున్నది. ఇవాళ కొత్తగా 1,288 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వైరస్ బారినపడిన వారిలో 610 మంది కోలుకున్నారు. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు కరోనా కేసుల సంఖ్య 9,04,548కి చేరింది. 8,88,508 మంది చికిత్సకు కోలుకున్నారు.మరో 8,815 యాక్టివ్ కేసులుండగా నేటివరకు 7,225 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా 31,116 శ్యాంపిళ్లను పరీక్షించినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు

పీచర సునీతారావు అవార్డుల కోసం రచనలకు ఆహ్వానం

ఇటీవలే స్వర్గస్థులైన శ్రీమతి పీచర సునీతారావు పేరుతో ఆమెభర్త విజేందర్‌రావు సాహితీ నిష్ణాతులకు అవార్డులు ఇవ్వ సంకల్పించారు. కవిత్వం, కథ, విమర్శ మూడు విభాగాలకు ఒక్కొక్క విశిష్ట గ్రంథానికి రూ.15000/- నగదు మరియు సత్కారం ఉంటుంది. ఈ అవార్డులకుగాను 2018 నుండి ఇప్పటి వరకు వెలువడిన కవితా సంపుటులు, కథా సంపుటులు, విమర్శ గ్రంథాలు మూడు చొప్పున ఈ క్రింది చిరునామాకు పంపించవలసినదిగా కోరుతున్నాం. **పుస్తకాలు పంపించవలసిన చివరి తేదీ: ఏప్రిల్ 12, 2021.**

చిరునామా: టి. మన్మోహన్‌రావు, ఇం.నెం. 1-5-431/2/16, రామేశ్వర్ నగర్ కాలనీ, జొన్నబండ, ఓల్డ్ అల్వాల్, హైదరాబాద్-500 010. సెల్: 9848698699.

-కాంచనపల్లి గో.రా. కన్వీనర్, అవార్డు కమిటీ.

ఆర్‌ఆర్‌ఆర్‌లో అజయ్‌దేవగణ్ మోషన్ పోస్టర్ విడుదల

ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ):ఎస్‌ఎస్ రాజమౌళి దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ హీరోలుగా నటిస్తున్నారు. అయితే ఈ మూవీలో ఈ ఇద్దరు హీరోల గురువుగా బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ కనిపించబోతున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా అజయ్ దేవగన్ పుట్టిన రోజు సందర్భంగా ఏప్రిల్ 2)న ÷- అజయ్ దేవ్‌గన్ ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేసారు. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు పెంచారు. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌లో లోడ్, ఎయిమ్, షూట్ అంటూ ఉద్వేగపూరితంగా సౌండ్ ఇచ్చారు. ఇప్పటికే ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఒలివియా, ఆలియాభట్ ఫస్ట్‌లుక్‌లను చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే.

తలైవి ట్రైలర్‌కు భారీ స్పందన
23న విడుదల కాబోతున్న చిత్రం

బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో తెరకెక్కుతున్న సినిమా 'తలైవి'. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో గత కొంతకాలంగా సినీ, రాజకీయ, క్రీడా కారుల జీవిత కథ ఆధారంగా బయోపిక్స్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జయలలిత చరిత్ర ఆధారంగా పాన్ ఇండియన్ సినిమాగా 'తలైవి' రూపొందించారు. సినీ తారగా, పార్టీ అధినేత్రిగా, ముఖ్యమంత్రిగా, ఐరన్ లేడీగా జయలలిత గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. జయలలిత జీవితంలో అనూహ్య సంఘటనలెన్నో ఉన్నాయి. ఆ సంఘటలను వెండితెర మీద ఆవిష్కరించబోతున్నాడు దర్శకుడు విజయ్. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌కు అభిమానుల నుంచి, ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. కాగా 'తలైవి' సినిమాని ఏప్రిల్ 23న భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నారు. ఈ క్రమంలో తాజాగా తలైవి సినిమా నుంచి 'ఇలా ఇలా తేలాను' అంటూ సాగే పాటను టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత అక్కినేని రిలీజ్ చేశారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ పాటను సైందవి ప్రకాష్ పాడారు. సిరా శ్రీ సాహిత్యం అందించారు. తెలుగుతో పాటు, హిందీ, తమిళంలో రిలీజ్ అయిన ఈ పాట ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది.

వీరమల్లు కోసం భారీ సెట్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ సినిమా 'హరిహర వీరమల్లు-. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్స్‌లో శరవేగంగా ఈ సినిమా చిత్రీకరణ సాగుతోంది. 17వ శతాబ్దంలోని మొఘల్, కుతుబ్ షాహీల చట్టాలను ఎదిరించిన ఓ వీరుడి కథగా వెండితెర మీద దర్శకుడు క్రిష్ ఆవిష్కరించబోతున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ ఏ.ఎం.రత్నం భారీ బ్జడెట్‌తో ఈ సినిమాని నిర్మిస్తున్నాడు. వీరమల్లుగా పవన్‌కళ్యాణ్ పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో ఇటీవల చిత్ర బృందం రిలీజ్ చేసిన ఫస్ట్ గ్లింప్స్‌లో జస్ట్ శాంపిల్ చూపించారు. ఇక ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ గెటప్.. ఆయన కాస్ట్యూంస్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కాగా తాజాగా ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల కోసం

పవన్ కళ్యాణ్ సెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న మేకింగ్ పిక్చర్స్‌ని చిత్ర బృందం సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్స్ వైరల్ అవుతున్నాయి. పవన్ కళ్యాణ్ కోసం క్యారెక్టర్ ఎంతగా శ్రమిస్తాడో ఆయన గత చిత్రాలలో చూశాము. ముఖ్యంగా ÷ట్స్ కోసం ఎక్కువగా కష్టపడుతుంటాడు. అలాగే ఇప్పుడు వీరమల్లు సినిమా కోసం ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇక ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ జాక్వలైన్ ఫెర్నాండెజ్ కీలక పాత్రలో కనిపిచబోతున్నారు. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నాడు. కాగా పవన్ కళ్యాణ్ రీ ఎంట్రీ సినిమా వకీల్ సాబ్ ఏప్రిల్ 9న భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

సాగర్ ఉప ఎన్నిక తరవాతే జాబ్ నోటిఫికేషన్

వివిధ శాఖల్లో ఖాళీల సంఖ్య 55 వేలుగా గుర్తించిన అధికారులు

వెటర్నరీ శాఖలో ఉద్యోగ నియామకాలకు ఇప్పటికే ప్రకటన

హైదరాబాద్,ఏప్రిల్2 (ఆర్ ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో త్వరలో 50 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఇటీవల ప్రకటించిన దరమిలా, సాగర్ ఉప ఎన్నిక తరవాత నోటిఫికేషన్ వెలువడ వచ్చని అంటున్నారు. ఉప ఎన్నిక కోడ్ ఉన్నందున తరవాత ప్రకటిస్తారని అంటున్నారు. అయితే అధికారులు వివిధ శాఖల్లో ఖాళీల లెక్కలను తేల్చారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన అనంతరం రాష్ట్రంలో మొత్తం ఖాళీల సంఖ్య 55 వేల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ నెల చివరి వారం నుంచి వరుసగా ఉద్యోగ ప్రకటనలు వచ్చే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో నిరుద్యోగులు ప్రిపరేషన్ ప్రారంభించారు. ఇదిలా ఉంటే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాజాగా ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 127 ఖాళీలను భర్తీ చేయనున్నారు. పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీలో సీనియర్ అసిస్టెంట్ విభాగంలో 15 ఖాళీలు, ఇదే యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్ విభాగంలో మరో 10 ఖాళీలు ఉన్నట్లు నోటిఫికేషన్లో పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో 105 జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ ఉద్యోగాలను సైతం ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలను కుంటున్న అభ్యర్థులు డిగ్రీతో పాటు కంప్యూటర్ అప్లికేషన్ లో ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమో చేసి ఉండాలి. లేదా బీసీఏ డిగ్రీ చేసి ఉండాలి లేదా కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు కలిగిన విభాగంలో డిగ్రీ చేసి ఉండాలి. టైప్ రైటింగ్ ఇంగ్లిష్ లో ప్రభుత్వం నిర్వహించిన టెక్నికల్ పరీక్ష పాసై ఉండాలి. అభ్యర్థుల వయస్సు ఈ జూలై 1 నాటికి 18-34 ఏళ్ల మధ్యలో ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగు లకు ఐదేళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్య ర్థులకు ఐదేళ్ల వయో పరిమితిలో సడలింపు ఇచ్చా రు. ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఇవ్వనున్నట్లు నోటిఫికేషన్లో స్పష్టం చేశా రు.రాత పరీక్షల ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 300 మార్కులకు ఎగ్జామ్ ఉంటుంది. జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ కు సంబంధించిన ప్రశ్నలకు 150 మా ర్కులకు ఉంటాయి. సెక్రటేరియల్ ఎబిలి టీస్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభా గంలో 150 ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ఈ ప్రశ్నలు ఉంటాయి. కంప్యూటర్ అప్లికేషన్ ప్రశ్నలు మాత్రం ఇం గ్లిష్ లోనే ఉంటాయి. అభ్యర్థులు టీఎస్పీఎస్సీ అధికారిక వెబ్ సైట్లో ఆ÷-లైన్ ద్వారా అప్లై చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 12న ప్రారంభం కానుంది. మే 05న దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరి తేదీ. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆ తేదీ లోగా అప్లై చేసుకోవాలని నోటిఫికేషన్లో స్పష్టం చేశారు.

పల్లె ప్రగతి..నూతన సమగ్ర గ్రామీణ విధానం

హైదరాబాద్, ఏప్రిల్ 2: పల్లె ప్రగతి కార్యక్రమం ఓ నూతన సమగ్ర గ్రామీణ విధానం. తెలంగాణ గ్రామాలు దేశంలోనే ఆదర్శంగా మారాలనేది సీఎం కేసీఆర్ ఆశయమని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తెలంగాణలో సశక్తి కరణ్ పురస్కారాలు సాధించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు.

పల్లెల్లో పచ్చదనం-పరిశుభ్రత వెల్లి విరియాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకే ఈ పథకం అమలవుతోందని తెలిపారు. మూడు విడతలుగా గ్రామాల్లో పల్లె ప్రగతి ప్రత్యేక అవగాహన, చైతన్యయాత్ర కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహించిందని తెలిపారు. అలాగే, గ్రామాల్లో ప్రజలకు జీవన భద్రత కల్పించడం, నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించడం, మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగు చేయడం, చేతి, కుల వృత్తులకు చేయూతనివ్వడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, సాగునీరు, మంచినీరు, ఆసరా పెన్షన్లు, మహిళలకు స్త్రీ నిధి ద్వారా వడ్డీ లేని రుణాలు ఇవ్వడం, రహదారుల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం, మౌలిక వసతుల ఏర్పాటు వంటి వాటిని ప్రభుత్వం పెంచుతున్నదన్నారు.

అందులో భాగంగానే కేంద్రం ప్రకటించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సశక్తి కరణ్ పురస్కార్ కింద రాష్ట్రానికి 12 అవార్డులు దక్కాయని ఆయన అన్నారు. ఈ అవార్డులు సాధించిన సంగారెడ్డి జెడ్పీ చైర్ పర్సన్ మండల పరిషత్ అధ్యక్షులు, గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, సీఈవో, ఎంపీడీఓలు, గ్రామ కార్యదర్శులు తదితరులను హైదరాబాద్ కి పిలిపించిన మంత్రి ఖైరతాబాద్‌లో గల రంగారెడ్డి జిల్లా పరిషత్ లోని మంత్రి కార్యాలయం కాన్ఫరెన్స్‌హాలులో వారిని సత్కరించారు.

అనంతరం వారిని ప్రగతి భవన్ కి తీసుకెళ్లి, సీఎం కేసీఆర్ తో కలిపించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ వారందరినీ సత్కరించి అభినందించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవే పెట్టిన పల్లె ప్రగతి వంటి పథకాలు, ఆ పథకాలను బాగా అమలు చేస్తున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరి కష్టం ఫలితమే ఈ అవార్డులు అని మంత్రి అన్నారు. కరోనా విస్తృతి నేపథ్యంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు మరింత అప్రమత్తంగా పని చేయాలని మంత్రి ఆదేశించారు.

కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ రఘునందన్ రావు, సంగారెడ్డి జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, పాల ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి, ఆ రెండు శాఖల అధికారులు, సిబ్బంది, విజేతలుగా నిలిచిన సర్పంచ్ లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డ్యాన్స్ పేరుతో వెకిలి చేష్టలు
శిక్షకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,ఏప్రిల్2(ఆర్‌ఎన్‌ఎ): డాన్స్ నేర్చుకుందామని వెళ్లిన బాలికతో ఆ మాస్టర్ ర్యాంగ్ స్టెప్‌లు వేయించేందుకు ప్రయత్నించాడు. క్లాసికల్ డ్యాన్స్ నేర్పిస్తానంటూ బెల్లీ డ్యాన్స్ పేరుతో వెకిలి చేష్టలకు దిగాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో డాన్స్ మాస్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సికింద్రాబాద్‌లో చోటు చేసుకుంది. బోయినపల్లి, జూపిటర్ కాలనీలో అర్బన్ డ్యాన్స్ వరల్డ్ పేరుతో సురేందర్ అనే వ్యక్తి ఇనిస్టిట్యూట్ ప్రారంభించాడు. క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకునేందుకు ఓ బాలిక చేరింది.

కొద్ది రోజుల తర్వాత డ్యాన్స్ మాస్టర్ సురేందర్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని తల్లిదండ్రులకు ఏడుస్తూ చెప్పింది. బెల్లీ డ్యాన్స్ పేరుతో వేధించాడని తెలిపింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పంటల ఎండిపోయిన రైతులను ఆదుకోవాలి- జడ్పిటిసి నాగం కుమార్

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్2 (నేటినిజం ప్రతినిధి): నీళ్లు లేక వరి పొలాలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని చందుర్తి జడ్పిటిసి నాగం కుమార్ అన్నారు, చందుర్తి మండలం సనుగుల గ్రామం లో ఎండిపోయిన వరి పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు, తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని మాటలలో చెప్పారే తప్ప ఆచరణలో చూపించడంలేదన్నారు, స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబు అందుబాటులో లేకపోవడంతో అన్ని గ్రామాలకు సక్రమంగా కాలువల ద్వారా గోదావరి జలాలు రావడం లేదన్నారు, ఇప్పటికైనా రైతుల పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు, అలాగే పంటలు ఎండి పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు, అనంతరం సనుగుల ఎర్ర చెరువు,పటేల్ చెరువును పరిశీలించారు, రెండు చెరువులను దత్తత తీసుకున్నమన్న ఎమ్మెల్యే ఎందుకు ఈ చెరువు కాలువ నిర్మాణాన్ని చేపట్టడం లేదని ప్రశ్నించారు, ఈ కార్యక్రమంలో జోగాపూర్ ఎం పి టి సి మ్యాకల గణేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింత పంటి రామస్వామి, నాయకులు పులినత్యంగౌడ్, దేవ స్వామి,ఏగోలపు నాగరాజు,అనిల్, బొజ్జ మల్లేశం, గణేశానాయక్, తిరుపతి నాయక్, కనకరాజ్ ఉప సర్పంచి పృథ్వి తదితరులు పాల్గొన్నారు,

కష్టపడితే ఫలితం దక్కుతుంది : ఎర్రోళ్ల శ్రీనివాస్

మహబూబ్‌నగర్, ఏప్రిల్2 : నిరుద్యోగులు కష్టపడి సాధన చేస్తే ఉద్యోగాలు సాధించడం సులభమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు.

లక్ష్యసాధన దిశగా అంకిత భావంతో ముందుకు సాగే వారే విజేతలవుతారని తెలిపారు.

వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో ఆల రఘుపతి రెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పేద విద్యార్థులు ఉద్యోగాలు సాధించేందుకు ఆల రఘుపతి రెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. నిరుద్యోగ విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉంటామని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్2 (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం లోని ఆటో డ్రైవర్లకు శుక్రవారం చందుర్తి సీఐ శ్రీలత అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు డ్రెస్ కోడ్ తప్పకుండా పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని పిలుపునిచ్చారు, ముఖ్యంగా కరోణ వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో ఆటోలో పరిమిత సంఖ్యలో ప్రయాణికులను తీసుకవెళ్లాలన్నారు, కరోనా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు, ఎస్ఐ సునీల్ మాట్లాడుతూ రోజురోజుకు కరోనా వ్యాధి విస్తరిస్తున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లు కోవిడ్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు, ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాలక ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు,

ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని స్కూళ్లను ఓపెన్ చేయాలి
-ట్రస్మా మండల అధ్యక్షులు రాచర్ల రాజు



రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్2 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెరుగుతున్న కరోనా కేసులను చూపెడుతూ స్కూళ్లను మూసేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని చందుర్తి ట్రస్మా మండల అధ్యక్షుడు రాచర్ల రాజు పేర్కొన్నారు. శుక్రవారం చందుర్తి మండల ట్రస్మా నాయకులు ఇల్లంతకుంట మండలం కంది కట్కూర్ లో జరిగిన జిల్లా ట్రస్మా సమావేశానికి తరలి వెళ్లారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువుకోవడం ప్రభుత్వానికి ఇష్టం లేనట్టుందని, స్కూళ్ల మూసివేతతో ప్రైవేట్ స్కూళ్ల మేనేజ్మెంట్లు, టీచర్లు రోడ్డునపడ్డారని, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి అందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ప్రైవేట్ స్కూళ్లు అద్దె భవనం?లోనే ఉన్నాయని. ఏడాది కాలంగా వాటి రెంట్లు, వాటర్ బిల్లులు, కరెంట్ బిల్లులు కట్టలేక మేనేజ్మెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో కేవలం నెలరోజులు మాత్రమే స్కూళ్లు తెరిచి మళ్లీ మూసేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. స్కూళ్లు నడపాలా? లేక మూసేసుకోవాలా? అని ప్రశ్నించారు.

బార్లమీద ఉన్న శ్రద్ధలో కొంచెమైనా స్కూళ్ల మీద లేదని అన్నారు. లాక్?డౌన్? టైంలో తమతోపాటు టీచర్లు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని, స్కూళ్లను తెరిచినట్లే తెరిచి మళ్లీ మూసేయడం ఎంతవరకు సమంజసమన్నారు.

లాక్ డౌన్ నుంచి ఇప్పటివరకు ప్రైవేట్ స్కూళ్లు ఆర్థికంగా చితికిపోయాయని అన్నారు. స్కూళ్లు క్లోజ్ చేయడం వల్ల టీచర్లు రోడ్డున పడ్డారని, దీనమైన స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరలి వెళ్లిన వారిలో ఈ ఏనుగుల కృష్ణా, పత్తిపాక నాగరాజు, నంబియార్ బాబు ఉన్నారు.

బిట్‌కాయిన్‌ను కొనుగోలు చేయడం, దానిలో పెట్టుబడి పెట్టడం మరింత సులభం

హైదరాబాద్, ఏప్రిల్ 2:సాంకేతిక, డిజిటల్ ఆవిష్కరణలు హైదరాబాద్ నగరానికి కొత్త కాదు. సాంకేతిక కేంద్రంగా, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థకు రూపశిల్పిగా 90ల నుంచి కూడా ఈ నగరం ముందుండటంతో పాటుగా ఫిన్‌టెక్‌లో ఎన్నో ఆవిష్కరణలకూ నిలయంగా మారింది. ఇప్పుడు హైదరాబాద్‌లో కనిపిస్తోన్న అత్యంత కీలకమైన ధోరణి ఏమిటంటే, భారీ సంఖ్యలో పెట్టుబడిదారులు క్రిప్టో ఆస్తులను స్వీకరించడానికి ఆసక్తి చూపుతున్నారు. మరీ ముఖ్యంగా హైదరాబాద్, వైజాగ్ లాంటి నగరాలలో వీరి సంఖ్య ఎక్కువగా కనబడుతుంది. సాధారణంగా బంగారంలో అధికంగా పెట్టుబడులు పెట్టే ఈ నగరాలు ఇప్పుడు బిట్‌కాయిన్‌లో పెట్టుబడులు పెడుతున్నాయి. మరీ ముఖ్యంగా హైదరాబాద్, అహ్మదాబాద్, లక్నో, బెంగళూరు వంటి నగరాల నుంచి ఎక్కువగా బిట్ కాయిన్‌లో పెట్టుబడులు పెడుతున్నారని వెల్లడించారు కాయిన్ డీసీఎక్స్ ఫౌండర్ సుమిత్ గుప్తా. ఆయనే మాట్లాడుతూ ఈ నగరాలలో మహిళలు సైతం క్రిప్టో ఆస్తులలో పెట్టుబడులు పెడుతున్నారని, మొత్తం పెట్టుబడులలో దాదాపు 20% వాటా వీరిది ఉంటుందన్నారు. ఈ నూతన వినియోగదారులకు సరళమైన అనుభవాలను అందించేందుకు కాయిన్ డీసీఎక్స్ ఇటీవల తాము ఆవిష్కరించిన కాయిన్‌డీసీఎక్స్ గో యాప్ ద్వారా క్రిప్టో పట్ల అవగాహన లేమి మరియు తమ పెట్టుబడుల భద్రత, రక్షణ పట్ల ఆందోళన కలిగిన మదుపరులకు భరోసా కల్పిస్తుంది. కాయిన్‌డీసీఎక్స్ గో యాప్ ఇప్పుడు ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఉపకరణాలపై లభ్యమవుతుంది. ఇప్పటికే 1.5 లక్షల సార్లు ఇది డౌన్‌లోడ్ కావడంతో పాటుగా క్రిప్టో విభాగంలో ఎంతోమంది నూతన వినియోగదారులు సైతం వచ్చారు. ఈ యాప్‌పై వినియోగదారులు క్రిప్టో కొనుగోలు లేదా అమ్మకాలు చేయడంతో పాటుగా ఓ కాఫీ లేదంటే టీ తాగే సమయంలో తన వ్యాపారాన్నీ ముగించవచ్చు. ఈ యాప్ ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న 4వేలకు పైగా క్రిప్టో ఎస్సెట్స్‌లో కేవలం అత్యుత్తమమైన 14 మాత్రమే ప్రదర్శిస్తుంది. హైదరాబాద్ మార్కెట్‌లో పెట్టుబడుల ధోరణులను గురించి కాయిన్ డీసీఎక్స్ కో ?ఫౌండర్ నీరజ్ అగర్వాల్ మాట్లాడుతూ "భద్రత, రక్షణకు భరోసా అందించేలా ఉండాల్సిన ఆవశ్యకతను మేము అర్థం చేసుకున్నాం. ప్రపంచంలో అత్యంత నమ్మకమైన క్రిప్టో కస్టోడియన్ బిట్గోతో భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా వినియోగదారులకు గో యాప్‌పై క్రిప్టో ఫండ్స్ పూర్తి సురక్షితంగా ఉంటాయనే భరోసా కల్పిస్తున్నాం. అదే రీతిలో వినియోగదారులను ఐడెంటిఫికేషన్ మోసాలనుంచి కాపాడేందుకు కాయిన్ డీసీఎక్స్‌తో సైతం భాగస్వామ్యం చేసుకున్నాం..."అని అన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు కి అంతర్జాతీయ ప్రశంసా పత్రం



రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్2 (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మేడికాల అంజయ్య అంతర్జాతీయ ప్రశ్నపత్రం అందుకున్నాడు, న్యూ ఢిల్లీ కి చెందిన సొసైటీ ఫర్ ఎన్విరాన్మెంట్, సస్టైనబుల్ డెవలప్మెంట్ సంస్థ నిర్వహణలో "పర్యావరణం, స్థిరమైన అభివృద్ధి,ఎన్విరాన్‌మెంటల్ అసెస్‌మెంట్ కోసం జిఐఎస్ రిమోట్ సెన్సింగ్‌పై అంతర్జాతీయ వర్క్‌షాప్ ను ఆన్ లైన్ ద్వారా మార్చి 31, ఏప్రిల్ 1 న నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా కోర్సు పూర్తిచేశాడు,

ఈ సందర్భంగా సొసైటీ ఫర్ ఎన్విరాన్మెంట్,సస్టైనబుల్ డెవలప్మెంట్ సంస్థ అంతర్జాతీయ స్థాయి ప్రశంస పత్రాన్ని శుక్రవారం అందించారు,ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ 2015 లో మొత్తం 192 ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు కలిసి 17 ప్రతిష్టాత్మక ప్రపంచ లక్ష్యాలు - సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ - 2030 నాటికి లక్ష్యాలను పరిష్కరించే ఆశయం, వేగం పెరిగినప్పటికీ, వాతావరణ మార్పు జీవవైవిధ్య నష్టం పర్యావరణం వంటి ముఖ్యమైన ప్రపంచ సమస్యలపై పెద్దగా పురోగతి లేదు కాబట్టి 2030 నాటికిఐక్య రాజ్య సమితి లక్ష్యాలను సాధించుటకు ప్రతి ఒక్కరు పాటు పడాల్సిన అవసరం ఉందన్నారు. నేటి ఈ పరిస్థితులకు అనుగుణంగా చెట్లును నాటి పర్యావరణాన్ని కాపాడాలని అంజయ్య పేర్కొన్నాడు,

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.